


మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 116 | పేజీలు : 8 | వెల : రూ.2/- శనివారం 23 మే 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# ఆస్కార్ స్థాయి నటుడు జగన్

## - తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు

**● రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు: మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**



**అమరావతి,మన జనప్రగతి మే 22:** మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని.. ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే మిగతా2లో...

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా..?

**● మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా..? ● కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను ● ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా..? ● ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా..? ● సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మే 22:** రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై మిగతా2లో...

# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

**- అటవీశాఖకు టార్గెట్ విధించిన డిప్యూటీ సీఎం**




2లో




# విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

**తొలిసారిగా ఏర్పాటు చేసిన ఎపి ప్రభుత్వం**

**లాంఛనంగా ప్రారంభించిన హోంమంత్రి అనిత**

**విశాఖపట్నం,మన జనప్రగతి మే 22:** విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారిగా హోంగార్డులకు ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. సుమారు రూ.33 లక్షల వరకు బీమా కవరేజ్‌ను మిగతా2లో...

# హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

**● జగన్ చరిత్ర తెలిసిన వారికి ఇవన్నీ అర్థం అవుతాయి**


**● వైఎస్ మరణం, వివేకా మరణంపై జగన్‌వైపే అనుమానాలు**

**● జగన్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి అచ్చన్నాయుడు**



**అమరావతి,మన జనప్రగతి మే 22:** హత్యా రాజకీయాలు, అక్రమాల్లో ఆరితేరిన ఘనుడు జగన్ అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన చరిత్ర చూస్తే ఇదే కనిపిస్తుందని అన్నారు. ఇటీవల వైఎస్ జగన్ ఇమీడియా సమావేశంలో చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ కుటుంబంలో జరిగిన మరణాలకు సీఎం చంద్రబాబు నాయుడే కారణమంటూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రవర్తన చూస్తుంటే మిగతా2లో...

# అత్యంత వేడి నగరాలు భారత్‌లోనే...



**హైదరాబాద్,మన జనప్రగతి మే 22:** ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల జాబితాలో 50 నగరాలు భారత్ లోనే ఉన్నట్లు నివేదిక తెలిపింది. శుక్రవారం ఉదయం 10.50 గంటలకు ఈ 50 నగరాల్లో ఉష్ణోగ్రత 43 డిగ్రీలుగా నమోదైనట్లు వాయు నాణ్యత, వాతావరణ సూచిక (ఎక్యూఐ) తెలిపింది. దేశంలోని ఉత్తర, మధ్య మరియు తూర్పు ప్రాంతాలలో తీవ్రమైన వడగాలులు విజృంభించడంతో.. మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటిపోయినట్లు నివేదిక తెలిపింది. ఒడిశాలోని బలాంగిర్ 45డిగ్రీల ఉష్ణోగ్రతతో అత్యంత వేడి ప్రాంతంగా నిలిచింది. మిగతా2లో...

# రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల





2లో

# మావిగన్ పేరుతో మభ్యపెట్టే యత్నం

**● ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ ● గొడ్డలి పార్టీ నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి ● గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**




**కర్నూలు,మన జనప్రగతి మే 22:** మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో అమరావతిని నాశనం చేయడమే కాకుండా.. ప్రస్తుతం మావిగన్ పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరిలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన వైకాపా.. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. మిగతా2లో...





## జూలై నుంచే అందుబాటులోకి భోగాపురం

**- అక్కడి నుంచే విమాన సర్వీసుల రాకపోకలు**

**అమరావతి,మన జనప్రగతి మే 22:** జులై 8వ తేదీ నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. జులై 5వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. జులై 8వ తేదీ నుంచి తమ విమానాలన్నీ భోగాపురం నుంచే నడుస్తాయని పలు విమానయాన మిగతా2లో...

# కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

## - రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన



**ముంబయి,మన జనప్రగతి మే 22:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
23 - 05 - 2026

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా..?

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమిలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమిలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

# హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

(మొదటి పేజీ తరువాయి)

'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ తాత వైఎస్ రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైఎస్ కుటుంబం నడిపిన దమనకాండను, అరాచకాలను ఆనాటి బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ కాలక్రమేణా తుదముట్టించారు. అయితే, రాజారెడ్డి హత్యకేసులో ఉన్న వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం.. జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్ కుటుంబానికి ఉన్న క్రూరత్వం, అరాచకాల చరిత్ర ప్రస్తుత తరానికి పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆనాడు అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన మాటల అసలు సందర్భాన్ని వివరిస్తూ.. తిరుమల వేంకటేశ్వర స్వామికి ఎవరైనా కీడు తలపెడితే వారికి ఎప్పటికీ మంచి జరగదు అని మాత్రమే చంద్రబాబు అన్నారని గుర్తు చేశారు. ఆ మాటలను జగన్ ఇవాళ తన స్వార్థం కోసం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' సంస్థ పాత్ర ఉందంటూ నానా హంగామా చేసి.. ఇప్పుడు చంద్రబాబును లాగడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి వక్రీకరణలు మానుకోవాలని హితవు పలికారు. జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో, ఆ హత్య వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని అచ్చెన్నాయుడు అన్నారు. మొదట గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసి, ఆపై గొడ్డలితో నరికి చంపిన చరిత్ర వారిదేనని, అందుకే వైసీపీని తాము 'గొడ్డలి పార్టీ' అని పిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారో జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. వివేకానంద కూతురు సునీతను అడిగితే నిజాలు చెబుతుందన్నారు. హత్యారాజకీయాల్లో ఆరితేరిన జగన్ వైఎస్ మరణంలోనూ పాత్ర ఉందని ఆనాడు లోకం కోడై కూసిందన్నారు.

# మావిగన్ పేరుతో మభ్యపెట్టే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

గొడ్డలి పార్టీ నాయకుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తెదేపా శ్రేణులపై ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని పార్టీ నేతలకు మంత్రి సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడి పెట్టాలంటే ఎవరు రాలేని పరిస్థితి ఉండేదని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పోటీపడి ముందుకు వస్తున్నార న్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మైనింగ్ శాఖలో రూ. 4 వేల కోట్లు అధికంగా రాబడి వచ్చిందని తెలిపా రు. చంద్రబాబు నాయుడు పరిపాలన విధానాన్ని చూసి భారత దేశంలో వచ్చిన పెట్టుబడులలో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయని అన్నారు. జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ.. బంగారు శుద్ధి, ఉత్పత్తికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఒకటన్ను ముడి సరుకు నుంచి ఒక గ్రాము బంగారం వస్తుందన్నారు. ప్రస్తుతం 300 మీటర్ల వరకు తవ్వారని... భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల వరకు తవ్వకాలు జరుపనున్నట్లు చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు ఇది అని అన్నారు. అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైన్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. బీచ్ శాండ్ ద్వారా ఖనిజ సంపదను గుర్తించడం జరిగిందన్నారు. గ్రానైట్, క్వార్ట్జ్‌కు బాగా డిమాండ్ ఉందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో మైనింగ్ దోపిడీ జరిపి జేబులు నింపుకున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ పరిశ్రమను వచ్చే నెల 27న సీఎం చంద్రబాబు ప్రారంభోత్సవం చేస్తారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ వెల్లడించారు. ఈ సమావేశంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర, నాయకులు సాంబశివారెడ్డి మనోహర్ చౌదరి, పురుషోత్తం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రానికి ఆర్‌బిఐ శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమిషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు- తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

## పెన్షన్లపై జగన్ అబద్ధాల ప్రచారం

- వైసిపి హాయంలోనే 11 లక్షలు తొలగింపు
- మండిపడ్డ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి,మన జనప్రగతి మే 22:** పెన్షన్‌లపై మాజీ సీఎం వైఎస్ జగన్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ పచ్చి అబద్ధం చెప్పారన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఏకంగా 11 లక్షల మంది నిరుపేదల పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మృతి చెందిన వారి పెన్షన్లు మాత్రమే రద్దయ్యాయని వివరించారు. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లో కొత్తగా 2.50 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తే.. 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ అబద్ధాలు మాట్లాడుతున్నారని మంత్రి ÷ర్ అయ్యారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో పెన్షన్ల కోసం రు.91 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లోనే రికార్డు స్థాయిలో రూ.63,157 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. జగన్ రెడ్డి అబద్ధపు ప్రచారాలను రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మవద్దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# నీచ రాజకీయాలు జగన్‌కు అలవాటే..

- తండ్రి శవం ఉండానే సిఎం కోసం పైరవీ
- ఐదేళ్ల పాలనలో ఎపిని భ్రష్టు పట్టించిన ఘనుడు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శలు



**అమరావతి,మన జనప్రగతి మే 22:**వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ది కోసం ఎంతటి నీచానికైనా దిగుతారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత తండ్రి మరణాన్ని సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం జగన్‌కే చెల్లిందని, ఆయన వైఖరి అత్యంత బాధాకరమని విమర్శించారు. అమరావతిలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జగన్ గత ఐదేళ్ల పాలనపై, ఆయన రాజకీయ శైలిపై నిప్పులు చెరిగారు.తండ్రి చావును కూడా రాజకీయ ప్రయోజనాలకు జగన్ వాడుకోవటం బాధాకరం. 5ఏళ్లు సీఎంగా ఉండి తండ్రి, బాబాయ్ హత్యపై అనుమానాలు ఎందుకు నివృత్తి చేయలేదు. అధికాకంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించి, ఇప్పుడు అధికారం పోయేసరికి ప్రజల్లో సానుభూతి కోసం 'బీద ఏడుపులు' ఏడవడం జగన్‌కే చెల్లిందన్నారు. ప్రజల్లో సానుభూతి పొందే ఆలోచనలు విరమించుకుని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యమైతే జగన్ కే మంచిది. జగన్ పరిపాలన, అరాచకాలను అసహ్యించుకునే.. 2024 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పారు. చంద్రబాబు నిర్ణయాలు నేటి తరంతో పాటు భవిష్యత్తు తరాలకూ ఉపయోగపడేలా ఉంటాయి. మూడు రాజధానులంటూ ప్రజల్లో తిరస్కరణకు గురయ్యారు.. ఇప్పుడు అమరావతి అభివృద్ధి చూసి ఓర్వలేక మావిగన్ అంటూ వితండవాదం చేస్తున్నారు. రాష్ట్రానికి, రాష్ట్రప్రజలకూ నష్టం చేసే నిలకడలేని జగన్ మాటలను ఎవరూ విశ్వసించరని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అమరావతి నిర్మాణంతో జగన్ తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు.

# ఆస్కార్ స్థాయి నటుడు జగన్

(మొదటి పేజీ తరువాయి)

భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. ప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎ÷-లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

**అమరావతి,మన జనప్రగతి మే 22:**అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కళ్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు. విత్తనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

పొందవచ్చు. హోం మంత్రి అనిత ప్రోత్సాహంతో మొదటి విడతగా 975 మంది హోంగార్డులకు ఆరోగ్య బీమాను అందించనున్నారు. ఈ బీమా పథకం కింద భర్త, భార్య, ఇద్దరు పిల్లల వరకు కవరేజ్ ఉంటుంది. హోం మినిస్టర్ అనిత మాట్లాడుతూ.. పోలీసు వారికి వర్తించే ఆరోగ్య భద్రత.. హోంగార్డులకు వర్తించకపోవడం, వారి వేతనాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలను దృష్టిలో ఉంచు కుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రూ.3 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. దీని ద్వారా సుమారు 3,140 మంది లబ్ది పొందనున్నారని తెలిపారు. హోంగార్డుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తి ఉచితంగా ఈ బీమా సదుపాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. విధు ల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు తిరిగి ఉద్యోగం కల్పించే పరిస్థితి లేనందున.. ఆ కుటుంబాలకుఏ కష్టం వచ్చినాఈ ఆరోగ్యబీమా ఎంతో సహాయపడుతుందని హోంమంత్రి వివరించారు.

# అత్యంత వేడి నగరాలు భారత్‌లోనే...

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత 44డిగ్రీల ఉష్ణోగ్రతతో చంద్రాపూర్, ప్రయాగ్‌రాజ్‌లతో పాటు ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్‌లలోని పలు నగరాలు నిలిచాయి. అయితే ఈ జాబితాలో సగానికి పైగా నగరాలు ఉత్తరప్రదేశ్ లోనే ఉండటం గమనార్హం. వారణాసి, బందా, బరేలీ, అయోధ్యల్లో మధ్యాహ్నానికి ముందే ఉష్ణోగ్రతలు 42డిగ్రీల నుండి 43 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఎపి, తెలంగాణల్లో భీమవరం, ఆదిలాబాద్, జగిత్యాలలు ఈ జాబితాలో నిలిచాయి.వాయువ్య, మధ్య భారతదేశ వ్యాప్తంగా వారంరోజుల పాటు తీవ్రమైన వడగాలుల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో పలు రాష్ట్రాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేసింది.

# జూలై నుంచే అందుబాటులోకి భోగాపురం

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. జులై 8వ తేదీ నుంచి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయానికి రావాలని ఇప్పటికే తమ ప్రయాణికులకు సర్క్యులర్లు జారీ చేశాయి. 2026 జూలై 8వ తేదీ నుంచి స్కూట్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన అన్ని విమానాలు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కాకుండా.. కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడుస్తాయని స్కూట్ ఎయిర్‌లైన్స్ సర్క్యులర్ జారీ చేసింది. విమానాశ్రయం మారినప్పటికీ, ఎయిర్‌పోర్ట్ కోడ్ " గానే కొనసాగుతుందని తెలిపింది. చెక్-ఇన్ కౌంటర్లు, స్కూట్ ఎయిర్‌లైన్స్ కౌంటర్లు కొత్త విమానాశ్రయంలోని టెర్మినల్ 1 లోపల ఉంటాయని విమానయాన సంస్థ వెల్లడిం చింది. విమానం బయలుదేరే సమయానికి 2.5 గంటల (150 నిమిషాలు) ముందే చెక్-ఇన్ కౌంటర్లు తెరవబడతాయని తెలిపింది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం) విశాఖపట్నం సిటీ సెంటర్ నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రయాణికులు ఎలాంటి ఆలస్యం లేకుండా చెక్-ఇన్ పక్రియలను పూర్తి చేసుకోవడానికి.. విమానం టైం కంటే కనీసం 120 నిమిషాల ముందే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవాలని స్కూట్ ఎయిర్ లైన్స్ సంస్థ సూచించింది.

# రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల




**హైదరాబాద్,మన జనప్రగతి మే 22:** 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఈసీ తెలిపింది. జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది.

## రైతుల సమస్యలపై గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు




**పత్తికొండ మన జనప్రగతి మే 22:-** పత్తికొండ తాలూకా జొన్నగిరిపగిడిరాయి మధ్యలో ఉన్న జియో మైసూర్ గోల్డ్ మైన్స్‌ను పరిశీలించడానికి వచ్చిన రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి రైతుల సమస్యలను వివరించారు. మైన్స్ యాజమాన్యం రైతుల పొలాల్లో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి, ఒక్కో పోలుకు రూ.6 వేల నష్టపరిహారం ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు చెల్లించలేదని రైతుల తరపున బీజేపీ నాయకులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన మంత్రి, సమస్యను మైన్స్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి మండల అధ్యక్షుడు లక్ష్మన్న, కర్నూలు జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి హోసూర్ బ్రహ్మయ్య, పత్తికొండ మండల అధ్యక్షుడు కరణం నరేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోవర్ధన్, రాంపల్లి రంగయ్య, ప్రధాన కార్యదర్శి వీరేష్, ఎద్దులదొడ్డి లక్ష్మణస్వామి, శ్రీనివాస్ ఆచారి, ఆదోని మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ సమక్షంలో ఘనంగా కడప నియోజకవర్గ సమన్వయ సమావేశం



**కడప మన జనప్రగతి మే 22:-** టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ కడప జిల్లా పర్యటనలో భాగంగా కడప నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో,నేతలతో భారీ సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్,కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి,అనంతపురం- హిందూపురం జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి,మంత్రి సవిత,ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి,టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి,ఇతర ముఖ్య నాయకులు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి నారా లోకేష్ ప్రసంగిస్తూ వైఎస్ జగన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ రెడ్డికి 'ఛీటింగ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' ఇవ్వొచ్చని,బయట ముద్దులు పెట్టి లోపల గొడ్డలి పోట్లు పొడవడం ఆయన నైజమని ఎద్దేవా చేశారు. ఆయన అద్భుత నటనకు 'భాస్కర్ అవార్డు' గ్యారంటీ అని,రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్మోహన్ రెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం మధ్య చిచ్చు పెట్టేందుకు సైకో బ్యాచ్ కుట్రలు పన్నుతోందని, నాయకులు, కార్యకర్తలు అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కేడర్ పైనే ఉందని స్పష్టం చేస్తూ,రానున్న "వర్చువల్ మహానాడు"ను ఘనంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, రాయలసీమ ప్రజల కల అయిన కడప స్టీల్ ప్లాంట్‌ను 2029 ఎన్నికల లోపు కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభించేలా తానే పూర్తి బాధ్యత తీసుకుంటానని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు

## జిల్లాలో బాల్యవివాహాలు,టీనేజీ ప్రెగ్నెన్సీలను పూర్తిగా నివారించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 22:-** జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాల నివారణ పై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా బాల్యవివాహాలు,టీనేజీ ప్రెగ్నెన్సీ లు నమోదు అవుతున్నాయని,వీటిపై నిరంతరం నిఘా ఉంచి పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీస్,ఏఎన్ఎం,ఆశ సిబ్బంది వారి పరిధిలో కౌమార దశలో ఉన్న బాలికలను, వారి తల్లిదండ్రులతోనూ సంప్రదిస్తూ బాల్య వివాహాలు చేయకుండా, టీనేజ్ గర్భం దాల్చకుండా వారికి సరైన సూచనలు చేయాలని,ఇందువల్ల జరిగే దుష్పరిణామాలను వివరించాలని ఆదేశించారు. అమ్మాయిలు చిన్న వయసులోనే గర్భం దాల్చడం వలన జరిగే నష్టాలను, ఇబ్బందులను కర్నూలు జిల్లా వైద్య విద్యార్థినుల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్వో ను, ఫోన్ ద్వారా కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ ను ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా, టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదు కాకుండా చైతన్యం తీసుకు వచ్చేలా కళాజాత బృందాలను, బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచార రథము, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఐసిడిఎస్ పిడి విజయ ను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, డిఎం హెచ్ ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ , ఐ సి డి ఎస్ పిడి విజయ పాల్గొన్నారు.

# మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టి.. యువతకు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం

### జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర,ఎమ్మెల్యే శ్యాం కుమార్




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 22:-** మైనింగ్ రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారంగా తీర్చిదిద్దడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను మంత్రి కొల్లు రవీంద్ర, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ కలిసి సందర్శించారు. గనుల్లో జరుగుతున్న తవ్వకాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులు, ఖనిజ శుద్ధి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం గనుల్లో సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు వెళ్లే అవకాశముందని తెలిపారు. రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతోందని, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి జరుగుతోందన్నారు. జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్, క్వార్ట్జ్, గ్రానైట్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**గోల్డ్ మైన్‌తో ప్రాంతీయాభివృద్ధికి కొత్త దిశ:ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్** ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం గోల్డ్ మైన్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇప్పటికే 300 నుంచి 400 మందికి పైగా స్థానిక యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. గతంలో ఉపాధి కోసం వలసలు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించడం వల్ల వలసలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభం కానుండటంతో మరింత ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ఆర్డీవో ఓబులేసు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగిని, డీఎస్పీ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీమా పేరుతో రైతులకు వేముల ఏపీజీబీ బ్యాంక్ షాక్..!






**సమాచారం లేకుండానే ప్రీమియం కట్**

**"కట్టకపోతే లోన్ లేదు" అంటూ హెచ్చరికలు**

**అప్పుల ఊబిలో ఉన్న రైతులపై అదనపు భారం**

**జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్..!**

**వేముల మన జనప్రగతి మే 22:-** వేముల ఏపీజీబీ (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్) అధికారుల వ్యవహారం రైతుల్లో తీవ్ర ఆందోళనకు, ఆగ్రహానికి దారితీసింది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన ప్రీమియాన్ని రైతుల అనుమతి లేకుండానే బ్యాంక్ అధికారులు చెల్లించి,ఇప్పుడు ఆ మొత్తాన్ని రైతుల నుంచే బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లోన్ రెన్యువల్ కోసం బ్యాంకుకు వెళ్లిన రైతులకు గత ఏడాది బీమా ప్రీమియం పేరుతో రూ.2,005/- చెల్లించాలని అధికారులు సూచించడంతో వివాదం మొదలైంది. "మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బీమా ప్రీమియం కట్టి, ఇప్పుడు డబ్బులు చెల్లించకపోతే రుణం పునరుద్ధరించమంటున్నారు. ఇది ఏ న్యాయం..?" అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయం నష్టాల్లో ఉండగా, పంటలు సరిగా రాక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులపై అదనపు భారం మోపడం అమానుషమని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం చెప్పిందనే పేరుతో బ్యాంక్ అధికారులు తమ అనుమతి లేకుండా డబ్బులు చెల్లించడం సరైన విధానం కాదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై బ్యాంక్ అధికారులను ప్రశ్నించగా,ప్రభుత్వం పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిందని, రైతులు చూసుకుని ఉండాలని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు పత్రికలు చదవలేడని, వ్యక్తిగత సమాచారం అందించడం బ్యాంకుల బాధ్యత కాదా అని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ఇతర బ్యాంకుల్లో ఇలాంటి పరిస్థితి లేకపోవడంతో ఏపీజీబీ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుల అనుమతి లేకుండా బీమా ప్రీమియం చెల్లించడం, అనంతరం రుణాల పేరుతో బలవంతపు వసూళ్లకు దిగడం చట్టబద్ధమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక గత సంవత్సరం ప్రీమియం కట్టకపోయినా రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతులు గట్టిగా నిలదీయడంతో బ్యాంక్ మేనేజర్ జరిగిన తప్పును అంగీకరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా బ్యాంకులో 33 మంది రైతులకు సంబంధించిన ప్రీమియం డబ్బులు అలాగే ఉన్నాయని,వాటిని సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

## ప్రతిభా పురస్కారాల్లో కేజీబీవీ బొమ్మనహాల్ విద్యార్థుల ప్రతిభ

- ప్రతిభా పురస్కారాన్ని అందజేసిన,ఎమ్మెల్యే కాలవ
- ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్,ఓ.ఆనంద్





**బొమ్మనహాల్ మన జనప్రగతి మే 22:-** రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో నిర్వహించిన ప్రతిభా పురస్కార కార్యక్రమంలో భాగంగా బొమ్మనహాల్ మండలానికి చెందిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని ఎం.దివ్య మండల టాపర్‌గా ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. అలాగే 100కు 100 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తెలుగు సీఆర్‌టిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు వందకు వంద మార్కులు సాధింపజేసిన కె.మైజాబిన్ కి ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులకుప్రోత్సాహకర సందేశం ఇచ్చారు. ఎమ్మెల్యే తనయుడు కాలువ భరత్ కాలువ ఫౌండేషన్ ప్రతినిధిగా హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి డిప్యూటీ డీఈవో కె.లక్ష్మన్న రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, బొమ్మనహాల్ మండల ఎంఈవో యు.వీరన్న,వి.మల్లికార్జున, బొమ్మనహాల్ కేజీబీవీ కళాశాల ప్రిన్సిపల్ కమలమ్మ,మరియు వివిధ మండలాల విద్యాశాఖ అధికారులుప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,పాఠశాల సిబ్బంది మరియు 550కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ అభినందనలు తెలియజేశారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి భవిష్యత్తులో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఉరవకొండ వాసికి అండగా 'రక్తదాత'

- 41వ సారి రక్తదానం చేసి

**ప్రాణదాతగా నిలిచిన మిత్రుడు**



**ఉరవకొండ మన జనప్రగతి మే 22:-** ఆపదలో ఉన్న స్నేహితుడికి అండగా నిలిచి 41వ సారి రక్తదానం చేసిన ఓ యువకుడు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడు. అత్యవసర సమయంలో స్పందించి స్నేహితుడి ప్రాణాలను కాపాడిన ఘటన ఉరవకొండలో ప్రశంసలు అందుకుంటోంది. ఉరవకొండ పట్టణానికి చెందిన కొల్లిగుండ్ల శేఖర్ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను బళ్లారిలోని ఆరాధన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శరీరంలో రక్తం శాతం చాలా తక్కువగా ఉందని, వెంటనే రక్తం ఎక్కించాలని సూచించారు. ఈ విషయం తెలుసుకున్న శేఖర్ స్నేహితుడు వెంటనే స్పందించాడు. ఇద్దరిదీ ఒకే రక్తగ్రూప్ అయిన ఓ పాజిటివ్ కావడంతో ఆలస్యం చేయకుండా వైద్యుల సమక్షంలో రక్తదానం చేశాడు. స్నేహితుడి ప్రాణాలు కాపాడాలనే లక్ష్యంతో ఆయన చేసిన ఈ సేవ అందరినీ కదిలించింది. ఇప్పటికే 40 సార్లు రక్తదానం చేసిన సదరు యువకుడు, ఈసారి 41వ సారి రక్తం అందించి మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నాడు. అత్యవసర సమయంలో ముందుకొచ్చిన రక్తదాతకు ఆసుపత్రి సిబ్బంది, శేఖర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
23 - 05 - 2026

## గొట్టిపాటి రవి కుమార్,విద్యుత్ శాఖ మంత్రి కడపలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటన



**కడప టౌన్ మన జనప్రగతి మే 22:–**
విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి గొట్టిపాటి జిల్లాలో అమలౌవుతున్న విద్యుత్ శాఖకు సంబంధిం చిన ప్రాజెక్టుల పై మంత్రి గొట్టిపాటి ఆరా తీశారు పీఎం సూర్యఘర్ పథకం అమలు పై అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి సూర్యఘర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పనుల ను త్వరగా పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలి అన్నారుఆర్డీఎస్ఎస్ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించిన మంత్రి గొట్టిపాటిపెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే మంజూరు చేయాలని అధికారులకు ఆదేశం

## శునకాల దాడిలో గాయపడ్డ పొడదుప్పిని కాపాడిన గ్రామస్తులు



**సిద్ధవటం మన జనప్రగతి మే 22:–** మండలంలోని మాధవరం గ్రామం రోడ్ నెంబర్ 19 వద్ద శుక్రవారం ఉదయం అటవీ ప్రాంతం నుండి త్రాగునీటి కోసం వచ్చిన ఒక పొడదుప్పిపై కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానిక గ్రామస్తులు వెంటనే స్పందించి కుక్కల బారి నుండి ఆ వన్యప్రాణిని కాపాడారు. అనంతరం ఒంటిమిట్ట ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం అందించి వారికి అప్పగించారు. అటవీ శాఖ అధికారులు ఆ పొడదుప్పిని ఒంటిమిట్ట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నర్వకాటి పల్లి అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ బి ఓ రామచంద్రారెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు. గ్రామస్తుల సమయస్ఫూర్తిని పలువురు అభినందించారు.

## శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి విశేష పూజలు



**సిద్ధవటం మన జనప్రగతి మే 22:–** మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఉదయం నుంచే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు

### ఈనెల 24న రాయలసీమ రీజనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2026: మేనేజింగ్ డైరెక్టర్ ఏ.రామిరెడ్డి




**కడప మన జనప్రగతి మే 22:–**ఈనెల 24న రాయలసీమ రీజనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2026 ను స్థానిక విష్ణుప్రియ కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు కడప ఆర్ఆర్ కెరీర్ సొల్యూషన్స్ ఎండి ఏ.రామిరెడ్డి వెల్లడించారు.కడప ప్రెస్‌క్లబ్‌లో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 24న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్,డిప్లమా,డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాత విద్యార్థుల కు ఎటువంటి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయో విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొని తెలుసుకోవచ్చన్నారు. ఈ ఫెయిర్ లో దేశంలోని 100కు పైగా యూనివర్సిటీలు పాల్గొంటున్నాయన్నారు. ఏ కోర్సులు తీసుకోవాలి, ఏ కోర్సులు తీసుకుంటే ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి, ఆ కోర్సులకు లభించే స్కాలర్షిప్పుల వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఎటువంటి ప్రవేశ రుసుము చెల్లించకుండా ఉచితంగా ఎడ్యుకేషన్ ఫెయిర్ లో పాల్గొనవచ్చని తెలిపారు.

## బాల లక్ష్మి నారాయణ నేత్రదానం ఇద్దరు అంధులకు చూపు





**లింగాల మన జనప్రగతి మే 22:–** మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన బాల లక్ష్మీనారాయణ (48 సంవత్సరాలు) శుక్రవారం మరణించడం తో ఆయన భార్య నారాయణమ్మ,కుమారుడు వంశీకృష్ణ,కుమార్తె లు భార్గవి,వాసంతి, అన్న లింగాల మండల విద్యా శాఖ అధికారి రామక్రిష్ణయ్య లు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు కి సమాచారం ఇవ్వడం తో లక్ష్మీనారాయణ పార్థివ దేహం నుండి రఘురామ్ కార్నియా లను సేకరించి హైదరాబాద్ లోని ఎల్ వి ప్రసాద్ నేత్రాలయానికి పంపడం జరిగింది. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఒక మనిషి మరణానంతరం మట్టిలో కలసిపోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వం తో ఈ ప్రపంచాన్ని చూడలేక బాధ పడుతూ ఉన్న ఇద్దరు అంధుల కు చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా మళ్ళీ ఈ ప్రపంచాన్ని చూసేలా జీవించే నేత్రదానం అనే బృహత్కార్యం తో అంధ రహిత సమాజం కోసం ప్రతి కుటుంబం ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సభ్యులు క్రిష్టారెడ్డి, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన చేనేత సొసైటీ ప్రతినిధులు

● 'నేతన్న భరోసా' అమలుకు వినతి



**సిద్ధవటం మన జనప్రగతి మే 22:–** కడప జిల్లాలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి జోనల్ కో–ఆర్డినేటర్ రెడ్డెప్ప గారి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సిద్దవటం మండలం, మాధవరం–1 గ్రామ పంచాయతీ యస్.కె.ఆర్ నగర్ గ్రామానికి చెందిన శ్రీ భద్రావతి భావనారాయణ చేనేత సొసైటీ సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రితో వారు సుదీర్ఘంగా చర్చించారు. వచ్చే ఆగస్ట్ 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని, చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. 'నేతన్న భరోసా' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి ₹25,000 ఆర్థిక లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తూ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ భద్రావతి భావనారాయణ చేనేత సొసైటీ అధ్యక్షుడు జింకా శ్రీనివాసులు, జొన్నాదుల శ్రీనివాసులు, శ్రీరామదాసు ఆంజనేయులు, బిట్టా రాజేంద్ర తదితర ముఖ్య నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు. తమ సమస్యలపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

## ఖాదర్ బంగ్లా బ్రిడ్జి నిర్మాణ పనులపై మంత్రి నారా లోకేష్‌కు వినతి



**సిద్ధవటం మన జనప్రగతి మే 22:–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను సిద్ధవటం మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కడప జిల్లా రెండు రోజుల పర్యటనలో భాగంగా, కడప రాజరాజేశ్వరి కళ్యాణమండపం ఎదురుగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఈ భేటీ జరిగింది.ఈ సందర్భంగా సిద్ధవటం మండల పరిధిలోని జ్యోతి ఖాదర్ బంగ్లా బ్రిడ్జి నిర్మాణ పనుల ఆవశ్యకతను, స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మోహన్ రెడ్డి మంత్రికి సమగ్రంగా వివరించి, ఒక వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని మోహన్ రెడ్డి మీడియాకు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి కడప జిల్లాకు విచ్చేసిన నారా లోకేష్‌కు ఈ సందర్భంగా వారు ఘనంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం సింగిల్ విండో అధ్యక్షులు దారపునేని దశరథ రామానాయుడు, సిద్ధవటం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్రతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెటరన్ జర్నలిస్ట్స్ డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

● పెన్షన్ మంజూరు కై ప్రభుత్వానికి సిపార్స్



**తిరుపతి మన జనప్రగతి మే 22:–**వెటరన్ జర్నలిస్ట్ లకు పెన్షన్ మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సిపార్సు చేస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేయారు.. శుక్రవారం తిరుపతి కలెక్టర్ చాంబర్ లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీసికువచ్చిన 2025–26 సంవత్సరపు డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెటరన్ జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం జిల్లా అసోసియేషన్ చేస్తున్న కృషిని కొనియాడారు.దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలలో వెటరన్ జర్నలిస్ట్ లకు ప్రభుత్వాలు పెన్షన్ అందజేస్తున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు,,ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు మాత్రమే దక్షిణ భారత్ లో ఈ విషయం లో వెనకబడ్డాయని పేర్కొన్నారు.అర్హులైన సీనియర్స్ జర్నలిస్ట్ లకు పెన్షన్ మంజూరు విషయం ఎంతో సమంజసమని రాష్ట్ర ప్రభుత్వంనకు సానుకూలంగా ప్రతిపాదన పంపగలనని కలెక్టర్ భరోసా ఇచ్చారు ..ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్,, జాతీయ ఉపాధ్యక్షులు డా. టి. జనార్దన్, జిల్లా కార్యదర్శి కె.. చంద్రశేఖర్,సహాయ కార్యదర్శి యం. సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ ను దుశ్శాలువతో సన్మానించారు..ఈ కార్యక్రమం లో సీనియర్ జర్నలిస్ట్ లు,, యాసిన్,, జి. సుకుమార్,, కృష్ణమూర్తి,, మునికృష్ణయ్య, సుధాకర్ రెడ్డి,, రాజగోపాల్,అల్లాభక్ష్,, కోటయ్య,రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు ,

# మంగంపేటలో వివాదాస్పద వ్యాఖ్యలపై ఉద్రిక్తత

● తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

● మిషన్,లారీ యజమానుల ఘాటైన హెచ్చరిక



**రైల్వే కోడూరు మన జనప్రగతి మే 22:–**తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం మంగంపేటలో నిర్వహించిన "చలో ఏపీఎండీసీ" కార్యక్రమం అనంతరం వివాదం రాజుకుంది. సమావేశంలో కొందరు వ్యక్తులు ఒక ఎక్స్పోర్ట్ కంపెనీని లక్ష్యంగా చేసుకుని చేసిన ఆరోపణలను స్థానిక మిషన్ యజమానులు, లారీ యజమానులు, డ్రైవర్లు మరియు గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు. వాస్తవాలు తెలుసుకోకుండా స్థానిక ప్రజల జీవనోపాధిపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు.ఏపీఎండీసీ స్టాక్ యార్డులో ప్రస్తుతం పనిచేస్తున్న 52 లోడింగ్ మిషన్లు, టిప్పర్ లారీలు పూర్తిగా మంగంపేట మరియు పరిసర గ్రామాలకు చెందినవేనని స్పష్టం చేశారు. ఆరోపణలు చేస్తున్న వారు ఒక కంపెనీని లక్ష్యంగా చేసుకున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి స్థానిక మిషన్ యజమానులు, డ్రైవర్లు, కార్మికులు మరియు వారి కుటుంబాల గౌరవాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.గ్రామంలోని వందలాది కుటుంబాలు మిషన్లు, లారీలు, రవాణా కార్యకలాపాల ద్వారానే జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. అలాంటి కుటుంబాలను అక్రమాలకు పాల్పడుతున్న వారిలా చిత్రీకరించడం తీవ్రంగా ఖండనీయం అని పేర్కొన్నారు.రాజకీయ ప్రయోజనాల కోసం స్థానిక ప్రజల ఉపాధిని బలి చేయాలని ప్రయత్నించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.ఏపీఎండీసీ నిబంధనల ప్రకారమే మొత్తం లోడింగ్ ప్రక్రియ జరుగుతోందని, అధికారుల పర్యవేక్షణలో సీసీ కెమెరాలు, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది సమక్షంలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక మిషన్, లారీ యజమానులు కేవలం అద్దె మరియు రవాణా సేవలు మాత్రమే అందిస్తున్నారని వివరణ ఇచ్చారు.ఇకపై ఎలాంటి ఆధారాలు లేకుండా మిషన్ యజమానులు, లారీ యజమానులు, ఉద్యోగులు, పోలీసులు లేదా గ్రామస్తులపై తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావాలు సహా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించవద్దని సూచించారు.స్థానిక ప్రజల జీవనోపాధితో రాజకీయాలు చేయడం మానుకోవాలని, వాస్తవాలు తెలుసుకుని మాత్రమే మాట్లాడాలని మంగంపేట మిషన్ మరియు లారీ యజమానులు విజ్ఞప్తి చేశారు.

## కిషోర బాలికలకు ఆర్థిక నిర్వహణపై అవగాహన

● పొదుపు మంత్రం నేర్పిన సిడిపిఓ శోభారాణి



**సిద్ధవటం మన జనప్రగతి మే 22:–** మండలంలోని సిద్ధవటం సెక్టార్ పరిధిలోని టక్కోలు అంగన్వాడి కేంద్రంలో కిషోర బాలబాలికల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'కిషోర వికాసం సెషన్ – 7' లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఓ ఎన్. శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై, ఆర్థిక నిర్వహణ అంశంపై పిల్లలకు, తల్లులకు విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిడిపిఓ శోభారాణి మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరమని పేర్కొన్నారు. డబ్బు అనేది జీవితంలో మన అవసరాలను తీర్చే ఒక సాధనం మాత్రమేనని, అదే అంతిమ లక్ష్యం కాకూడదని ఆమె స్పష్టం చేశారు. సంపాదించిన డబ్బును తెలివిగా, ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకున్నప్పుడే జీవితంలో స్థిరపడగలమని సూచించారు. ప్రతిరోజూ కొంత మొత్తాన్ని పొదుపు చేసే అలవాటు చేసుకోవడం వల్ల, భవిష్యత్తులో వచ్చే ఆకస్మిక అవసరాలకు ఆ డబ్బు ఎంతగానో సహాయపడుతుందని వివరించారు. డబ్బును దుర్వినియోగం చేయకుండా జాగ్రత్త వహించాలని, ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా ముందే ఒక చిన్న ప్రణాళిక తయారు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి అమ్మాయి చిన్నతనం నుంచే స్వయంసమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో, వారానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని పొదుపు చేయడం ప్రారంభించాలని సూచించారు. ఇందుకోసం సొంతంగా వారపు బడ్జెట్‌ను రాసుకుంటూ, తమ ఖర్చులను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని బాలికలకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు వరలక్ష్మి దేవి, శ్రీవిద్య, దీపతో పాటు స్థానిక అంగన్వాడి కార్యకర్తలు, కిశోర బాలబాలికలు మరియు వారి తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుపతిని అర్బన్ మోడల్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

● టిడిపి రాష్ట్ర నేత డాక్టర్ 'కోడూరు' చేపట్టిన ప్రయత్నాలకు ప్రభుత్వం సానుకూలం

● నగర అభివృద్ధిపై మంత్రి లోకేష్, సీఎంఓ అధికారుల సానుకూలం



**తిరుపతి మన జనప్రగతి మే 22 :–** తిరుపతి ని ఆధ్యాత్మిక నగరంతో పాటు ఐటీ హబ్, మోడల్ అర్బన్ సిటీగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం చెప్పారు. గత మూడు రోజులుగా అమరావతిలో టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న,ఇతర అధికారులతో డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం పలుమార్లు కలసి తిరుపతి ని మోడల్ సిటీ తో పాటు ఐటీ హబ్ గా తీర్చిదిద్దే విధంగా సుదీర్ఘంగా చర్చించారు. అందుకు మంత్రి నారా లోకేష్ తో పాటు సీఎంఓ అధికారులు కూడా సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న ను డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తో పాటు రాష్ట్ర నేతలు పుష్పావతి యాదవ్, కృష్ణ యాదవ్ కలిసి తిరుపతి నగరంలో ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, అభివృద్ధికి చెప్పడాల్సిన పనులపై సుదీర్ఘంగా ప్రద్యుమ్నతో డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం చర్చించారు. **ప్రతిపాదించిన ప్రధాన అంశాలు ఇవే.......** తిరుపతిని స్పిరుచువల్ క్యాపిటల్, ఐటి ఇన్నోవేషన్ హబ్, క్లీనెస్ట్ పిలిగ్రిమ్ సిటీగా అభివృద్ధి చేయడం..... నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడం...... నగరపాలక సంస్థ పరిధిలోని ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు, నియంత్రిత వెడ్డింగ్ జోన్ల ఏర్పాటు.... రోడ్డు పక్కన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఈట్ స్ట్రీట్ జోన్లను ఏర్పాటు చేయడం...... తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో 'ఫ్లెక్సీల ఫ్రీ తిరుపతి' అమలు ద్వారా నగర శుభ్రత క్రమశిక్షణ పెంపు..... ఈ– షటిల్ ( ఎలక్ట్రిక్ మొబిలిటీ ) ప్రాజెక్టు ఏర్పాటు చేసి ఆధునిక రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం. వంటి కార్యక్రమాల అమలుకు కార్యాచరణ రూపొందించడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్నతో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. అందుకు వారు సానుకూలత వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని టిడిపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కు హామీ ఇచ్చారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
23 - 05 - 2026

# దేవుడి భూములు అమ్మకంతో సంపద సృష్టించడమా..?

- రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్న "సంపద సృష్టికర్త" చంద్రబాబు
- వైసీపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ ఎద్దేవా



**కమలాపురం మన జనప్రగతి మే 22:-**రాష్ట్రంలో సంపద సృష్టించడం అంటే దేవుడి భూములను అమ్మకానికి పెట్టడమేనా అని వైసీపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరును తీవ్రంగా ఎద్దేవా చేశారు.శుక్రవారం సాయంత్రం కమలాపురంలో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ..అనంతపురం జిల్లాలోని కమలాపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న పుష్పగిరి మఠానికి చెందిన భూములు విక్రయానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేయడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు.తాను రాష్ట్రాన్ని అప్పులపాలు చేయనని, సంపద సృష్టించి ఆర్థికాభివృద్ధి సాధిస్తానని ప్రజలకు హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత దేవుడి భూములను అమ్మడం ద్వారా సంపద సృష్టించాలనుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు.చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ భూములను అమ్మి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ఖజానాకు జమ చేస్తే కొంతమేరకు సంపద సృష్టించిన వారవుతారని వ్యాఖ్యానించారు. తమ సొంత ఆస్తులను పక్కనపెట్టి దేవుడి ఆస్తులను అమ్మి గొప్పలు చెప్పుకోవడం 16 సంవత్సరాల ముఖ్యమంత్రి అనుభవం ఉన్న చంద్రబాబుకే చెల్లుతుందని ఎద్దేవా చేశారు.తాను గొప్ప ఆర్థిక మేధావిని, తన విజన్ రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతుందని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చివరకు దేవుడి భూములను కూడా విక్రయించే స్థాయికి దిగజారడం దురదృష్టకరమన్నారు. అధికారం ఉందని అహంకారంగా ప్రవర్తిస్తూ దేవుడికి ద్రోహం చేస్తే కూటమి పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.పుష్పగిరి మఠానికి చెందిన భూములను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, వాటి అమ్మకానికి ఉత్తర్వులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి దేవుడి భూముల అమ్మకానికి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేసి దేవాలయ ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.

# అలిపిరి పరిసరాల్లో పుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించండి: డిప్యూటీ కమిషనర్ అమరయ్య



**తిరుపతి మన జనప్రగతి మే 22:-** అలిపిరి పరిసరాల్లో భక్తులకు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా పుట్ పాత్ లపై ఉన్న దుకాణాలను తొలగించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య అధికారులు, వ్యాపారస్థులకు సూచించారు. భక్తులు, వాహన చోదకుల పిర్యాదు మేరకు ఏ ఎస్పీ రవి మనోహరాచారి, పోలీస్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి అలిపిరి పరిసర ప్రాంతాల్లో పుట్ పాత్ పై ఉన్న వ్యాపారస్థులతో మాట్లాడారు. పుట్ పాత్ పై వ్యాపారాలు చేయడం వలన ప్రజలతో పాటు భక్తులకు తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. అలాగే టిఫిన్ షాప్, దుకాణాల వ్యర్థాలు జూ పార్కు రోడ్డు పక్కనే వేయడంతో వన్యమృగాలు వస్తున్నాయని తెలిపారు. కావున ఇక్కడ ఇబ్బందికరంగా ఉన్న దుకాణాలను ఇక్కడ నుండి తొలగించాలని, లేకుంటే మేమే తొలగించడం జరిగితుందని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ వెంట డి ఎస్పీ లు కొండయ్య నాయుడు, భక్తవత్సలం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సి ఐ లు రామ కృష్ణ, రామ్ కిషోర్, ఏసీపీ పార్వతి ప్రియ, పోలీస్, హెల్త్, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది ఉన్నారు.

# ప్రొద్దుటూరులో ఘనంగా జాతీయ థైక్వాండో ఓపెన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం





**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 22:-** తొలి నేషనల్ థైక్వాండో ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. యూత్ థైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆర్గనైజింగ్ మెంబర్ సలీం నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు దాదాపు 12 రాష్ట్రాల నుండి క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎస్పీ విభూకృష్ణ, టూ టౌన్ సీఐ వంశీనాథ్, ఎస్సై మహబూబ్ బాష పాల్గొని రెఫరీలను పరిచయం చేసుకుని చిన్నారుల మధ్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విభూకృష్ణ మాట్లాడుతూ ఒకే వేదికపై 12 రాష్ట్రాల క్రీడాకారులను తీసుకురావడం ఆనందకరమని, ప్రొద్దుటూరు జాతీయ స్థాయి థైక్వాండో పోటీలకు వేదిక కావడం శుభపరిణామమన్నారు.థైక్వాండో ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగకరమైన క్రీడ అని,ముఖ్యంగా అమ్మాయిలు ఈ క్రీడను నేర్చుకోవాలని సూచించారు. యువత తమ శక్తి, నైపుణ్యాలను సానుకూల దిశగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు.కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్ అయిన టూ టౌన్ ఎస్సై మహబూబ్ బాష మాట్లాడుతూ తాను కూడా థైక్వాండో క్రీడాకారుడినేనని తెలిపారు.లక్ష్యసాధనకు కృషి, పట్టుదల అవసరమని, ఓటమిని విజయానికి తొలి మెట్టుగా భావించాలని క్రీడాకారులకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు.సీఐ వంశీనాథ్ మాట్లాడుతూ ఎస్సై మహబూబ్ బాష థైక్వాండో ఛాంపియన్ అని ఈ కార్యక్రమం ద్వారా తెలిసిందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే చిన్నారులు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు.వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ మాట్లాడుతూ థైక్వాండో శారీరక దృఢత్వం, ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడే క్రీడ అన్నారు. 2000 ఒలింపిక్స్‌లో ఈ క్రీడకు గుర్తింపు లభించిందని, భారత్ నుంచి కూడా పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఆర్గనైజింగ్ మెంబర్ సలీం మాట్లాడుతూ ప్రొద్దుటూరు మరియు పరిసర ప్రాంతాల్లో థైక్వాండో క్రీడను ప్రోత్సహించడమే ఈ టోర్నమెంట్ లక్ష్యమన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్‌కు వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, రెఫరీలు, తల్లిదండ్రులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్ హరి ఆధ్వర్యంలో చిన్నారుల థైక్వాండో ప్రదర్శనలు, నటరాజ కళాక్షేత్రం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో యూత్ థైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రదీప్ కుమార్, సాయ్ కోచ్ సోమేశ్వరరావు చౌహాన్, ఏపీ ఛైర్మన్ మోహన్ కృష్ణ, తెలంగాణ ఛైర్మన్ రమేష్, తెలంగాణ మెంబర్ రాంబాబు, సీనియర్ కోచ్ మాస్టర్ ఉదయ్, చీఫ్ కోచ్ మహబూబ్ బాష, సీనియర్ కోచ్ హరి, వైస్ ఛైర్మన్ రామకృష్ణ పాల్గొన్నారు.

# రియల్ టైం గవర్నెన్స్‌తో... సమర్థవంతమైన పరిపాలన: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**మదనపల్లి మన జనప్రగతి మే 22:-**రియల్ టైం గవర్నెన్స్ తో... రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనను మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువగా మార్చే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం అమరావతి సచివాలయం నుండి సీసీటీవీ అనలిటిక్స్, ప్రజా భద్రత పర్యవేక్షణ, డ్రోన్ల వినియోగం, స్టేట్ డేటా లేక్, డేటా ఆధారిత పాలన, మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), అవేర్ ప్లాట్‌ఫామ్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ , రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలు, ఏపీ డిజివెరిఫై, ఆర్టీజీఎస్ లెన్స్, కౌశలం, అధికారుల పనితీరు ట్రాకింగ్ వ్యవస్థ వంటి అంశాలపై ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు జారీ చేశారు.వీసి అనంతరం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల్లో సాంకేతిక ఆధారిత పరిపాలనను బలోపేతం చేయడం, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, జిల్లాకు అవసరమైన ప్రత్యేక వినియోగ కేసులను అధికారులు ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి, వాటిని సేవల మెరుగుదలకు వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే జిల్లా స్థాయిలో డేటా నాణ్యత, సమన్వయం, పారదర్శకతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం ద్వారా పాలనను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణ రక్షక చికిత్సకు అవయవ దానంపై అవగాహన పెరగాలి: డాక్టర్ పార్థసారథి




**కాకినాడ మన జనప్రగతి మే 22:-**కాలేయం మార్పిడి వంటి ప్రాణ రక్షక చికిత్స అందుబాటులోకి రావాలంటే అవయవ దానంపై అవగాహన పెరగడం చాలా అవసరం అని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు పి పార్థసారథి అన్నారు.అధిక స్థాయి కాలేయ వ్యాధులు, కాలేయ వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు కాలేయ మార్పిడితోనే ప్రాణరక్షణ చికిత్స అని వైద్యుడు పార్థసారథి పేర్కొన్నారు.స్థానిక ఓ హోటల్లో శుక్రవారం కాలేయ వ్యాధులపై విలేకరులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ లివర్ సిరోసిస్, ఆకస్మిక లివర్ ఫెయిల్యూర్, కొన్ని ఎంపిక చేసిన లివర్ క్యాన్సర్ కేసులు,జన్యుపరమైన లివర్ వ్యాధులు మరియు క్రానిక్ హెపటైటిస్ వల్ల వచ్చే సమస్యల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం అవుతుందని తెలిపారు.వైద్య చికిత్సలకు స్పందించని రోగుల్లో ఆసైటిస్ (కడుపులో నీరు చేరడం), జాండిస్, హెపాటిక్ ఎన్సెఫలోపతి వంటి తీవ్రమైన సమస్యలు ఏర్పడితే లివర్ ట్రాన్స్‌ప్లాంట్ అవసరం అవుతుందని చెప్పారు.ఆధునిక శస్త్రచికిత్స పద్ధతులు శస్త్రచికిత్స తర్వాత మెరుగైన సంరక్షణ వల్ల ఉత్తమ ఫలితాలు వుంటాయని అన్నారు.మార్పిడి చికిత్స తర్వాత రోగులు జీవితాంతం మందులు తీసుకోవాల్సి ఉంటుందని, సరైన సంరక్షణతో చాలా మంది రోగులు సాధారణ జీవితాన్ని కొనసాగించగలరని చెప్పారు.ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, ఎగ్జిక్యూటివ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టెంట్ హౌస్ యజమానులు ఐక్యంగా సహకరించుకోవాలి: బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి



**కాకినాడ మన జనప్రగతి మే 22:-** ప్రస్తుతం టెంట్ హౌస్ రంగంలోకి కార్పొరేట్ తరహా విధానంలోకి వెళ్ళిపోతుందని దాన్ని తిరిగి తమ ఆధీనంలోనే ఉంచుకునే విధంగా సౌకర్యాలు అందించి తగు మన్ననలను పొందాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం కాకినాడ సినిమా రోడ్లో ఉన్న ఓ హోటల్లో కాకినాడ జిల్లా టెంట్ హౌస్ ఫంక్షన్ మెటీరియల్ లైటింగ్ అండ్ సౌండ్ సిస్టం యజమానుల సంక్షేమ సంఘం (రి.146/2026) కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ టెంట్ హౌస్, మెటీరియల్ అన్ని వేడుకలకు చాలా ముఖ్య అవసరమన్నారు. గతంలో వివిధ విభాగాలుగా ఉన్న వారందరూ కలిసి ఒకే వేదికపై వచ్చి సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకోవడం అత్యంత ఆనందకరమని అన్నారు. భవిష్యత్తులో ఒకే కుటుంబంగా వ్యాపార అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని చప్పిడి సూచించారు. సంఘం అధ్యక్షుడు నారాయణ దాస్ బాబ్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఈ తరహ సంఘం ఏర్పాటు చేయాలని అది నేటికి ఒకే సంఘం మీదకు రావడం ఆనందకరమన్నారు. కలసికట్టుగా ఐక్యంగా ఈ యజమానుల సంఘం పనిచేసి గౌరవం పొందుతామని చెప్పారు. సంఘం గౌరవ అధ్యక్షుడు యక్కల ప్రసాదరావు, దొంతికుర్తి కాశీ విశ్వనాథ్, కార్యదర్శి కొప్పిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు నడికట్ల లోవరాజు, జాయింట్ సెక్రటరీ డొకుబుర్ర రామరాజు, జాయింట్ ట్రెజరర్ రెడ్డి సత్తిబాబు, యడ్ల వేణునాదం, సోమేశ్వరరావు, బన్నూ, వాసు, చిన్న, నాగేశ్వరరావు, శ్రీనివాస్, వీరబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో పిడుగు ప్రభావం.. పాక్షికంగా దెబ్బతిన్న ప్రహరీ గోడ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 22:**పులివెందులలో గురువారం రాత్రి పిడుగుపాటుకు భవనం ప్రహరీ గోడ పాక్షికంగా దెబ్బతినడం జరిగింది. వివరాలలోకి వెళితే గురువారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడినటువంటి వర్షానికి రాణి తోపు పరిసర ప్రాంతాల్లో పురుషోత్తం రెడ్డి వీధి ఆసం రాజారెడ్డి నివాస గృహం రెండవ అంతస్తు నందు పిడుగుపాటు ప్రభావంతో ఎలివేషన్ గోడ పాక్షికంగా దెబ్బతినగా పిడుగు ప్రభావంతో ఇంటిలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో యజమాని కుటుంబ సభ్యులు ఆందోళనకు గురికాగా ప్రమాద తీవ్రత పాక్షికం కావడంతో ఇంటి యజమాని ఆసం రాజారెడ్డి ఊపిరి పీల్చుకున్నారు.పిడుగుపాటు నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా పిడుగుపాటు సమయంలో భౌతిక రక్షణ మరియు సామాజిక అవగాహన తదితర అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# చెన్నూరులో అర్ధరాత్రి ఉరుములు మెరుపులు పెనుగనులతో భారీ వర్షం

**చెన్నూరు మన జనప్రగతి మే 22:-** చెన్నూరు మండల వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి పెనుగాలులు ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఏ కదాటిగా 45 నిమిషాల పాటు భారీ వర్షం కురవడంతో 43 మిల్లీమీటర్ల వర్షపాతం చెన్నూరులో నమోదయింది. ఈ మేరకు చెన్నూరు తాసిల్దార్ కార్యాలయంలో వర్షపాతం నమోదు చేశారు. భారీ వర్షంతో ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. శుక్రవారం ఉదయం నుంచి కూడా కాస్త వాతావరణం చల్లబడినప్పటికీ మధ్య మధ్యలో ఎండ వేడిమి తన ప్రతాపం చూపించింది. మొత్తం మీద భారీ వర్షం కురవడంతో చెన్నూరు మండల ప్రజలు కొంతమేరకు ఉపశమనం పొందారు.

# సంగారెడ్డి కలెక్టర్‌ను కలిసిన మెట్టు కుమార్ యాదవ్



**సంగారెడ్డి మన జనప్రగతి మే 22:-** సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌ను వారి కార్యాలయంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కలెక్టర్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించాలని కోరారు. సంగారెడ్డి జిల్లా అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ముఖ్యంగా యువత, రైతులు, పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.అలాగే పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మాజీ వార్డు కమిటీ మెంబర్ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం..


## - ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 22:-**మైదుకూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రొద్దుటూరు క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మైదుకూరు నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు హాజరై తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలు, వ్యక్తిగత వినతిపత్రాలు ఎమ్మెల్యే కి సమర్పించారు. ప్రజలు వినిపించిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే శ్రద్ధగా విని, వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖ అధికారులకు సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ని ప్రజలు అభినందించారు.

# పులివెందుల పరిధిలో ఈదురుగాలులు

## - నేలమట్టమైన అరటి తోటలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 22:**పులివెందుల నియోజకవర్గం పరిధిలో గురువారం రాత్రి అకాల వర్షం మరియు భారీ ఎత్తున గాలులు వీచడంతో అరటిపంట నేల కూలడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గురువారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన బలమైన గాలులతో వర్షం కురువగా కొట్టాల, మబ్బు చింతలపల్లి, తుమ్మలపల్లె గ్రామాలలో గాలివానకు అరటి చెట్లు మరియు కరెంటు స్తంభాలు నేలకొరిగాయి.కొట్టాల గ్రామంలో రైతు శ్రీనాథ్ 1.5 ఎకరాలలో అరటి మొత్తం నేలమట్టం కావడంతో భారీ నష్టం ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో గాలితో కూడిన వర్షం కురవడంతో అరటి చెట్లు కింద పడిపోవడం కారణంగా అధిక మొత్తంలో నష్టం నష్టం వాటిల్లినదని అరటి పంటకు ఎకరాకు రెండు లక్షలు పైచిలుకు పెట్టుబడి పెట్టి సాగు చేశామని ఒకవైపు ధరలు పడిపోవడంతో పాటు మరోవైపు ప్రకృతి కరుణించకపోవడంతో రైతులకు నష్టమే వాటిల్లుతోందని దయచేసి ప్రభుత్వం రైతాంగ ఆవేదనను పరిగణలోనికి తీసుకొని ఆదుకునే ప్రయత్నం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

23 - 05 - 2026

## పులివెందుల అంధుల ఆశ్రమంలో అన్నదానం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 22:**పులివెందుల ట్రాఫిక్ సి.ఐ.గోలగణ ప్రసాద్ రావు – సంతోష్ సౌజన్య దంపతుల కుమార్తె గోలగణ జ్ఞాన దీపిక మరియు గోలగణ భాను శంకర్ పుట్టినరోజుల సందర్భంగాస్థానిక కచేరీ రోడ్డులోని గీత మందిరం పక్కన ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ట్రాఫిక్ సి.ఐ.గోలగణ ప్రసాద్ రావు తన చేతుల మీదుగా అంధులకు,వృద్ధులకు భోజనాన్ని వడ్డించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పిల్లల పుట్టినరోజుల వేడుకలను పురస్కరించుకుని దేవాలయంలో, ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.సమాజంలో ఉన్న నిరుపేదలను,అంధులను, వృద్ధులను ఆదుకోవడం మనందరి బాధ్యత.పిల్లల పుట్టినరోజులను ఇలాంటి సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో తృప్తిని ఇస్తుందని ట్రాఫిక్ సి.ఐ గోలగణ ప్రసాద్ రావు పేర్కొన్నారు.అన్నదానాన్ని స్వీకరించిన ఆశ్రమ అంధులు,వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. అన్నదాతల కుటుంబ సభ్యులందరికీ ఆ దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని,పిల్లలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా దీవిస్తూ,కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు.ఈ సేవా కార్యక్రమంలో శివ శంకర్,పోలీస్ సిబ్బంది మరియు ఆశ్రమ నిర్వాహకులు అనిమెల రామమోహన్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి: సిఐ నర్సింహులు



**వేంపల్లె మన జనప్రగతి మే 22:–**ప్రశాంత వాతావరణంలో ముస్లిం సోదరులు అందరూ శాంతియుతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని సిఐ నర్సింహులు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ లో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ జరగకుండా ముస్లిం మైనార్టీ పెద్దలు సహకరించాలని కోరారు. సామరస్య పూర్వకంగా పండుగను జరుపుకొనేలాగ చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్ఐ తాయార్ హుస్సేన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## ఫలితాలు కోసం వేచి చూడకుండా దరఖాస్తులు చేసుకోండి

**వేంపల్లె మన జనప్రగతి మే 22:–**ఆర్జీయూకేటీ ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదోవ తరగతి పరీక్షల రీవెరిఫికేషన్, రీవాల్యుయేషన్ ఫలితాల కోసం వేచి చూడకుండా,ఆసక్తి ఉన్న విద్యార్థులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని ఆర్జీయూకేటీ కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సంద్ర తెలిపారు. ఆర్జీయూకేటీ 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తులు చేసుకొనేందుకు చివరి తేది మే 30 అన్నారు. ఒకవేళ రీవెరిఫికేషన్, రీవాల్యుయేషన్ అనంతరం మార్కుల్లో మార్పులు వచ్చినట్లయితే, ఎస్ఎస్ఈ బోర్డు అధికారికంగా అందించిన సవరించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని ఎంపిక జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. అందువల్ల, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా నిర్దిష్ట గడువులోపు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

## ఈ నెల 27,28వ తేదీలలో క్లస్టర్ వారిగా మహానాడు కార్యక్రమాలు

**గుర్రంకొండ మన జనప్రగతి మే 22:–**ప్రతి సంవత్సరం మే నెల 27,28 వ తేదీన జరిగే మహానాడును ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ లోని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ల వారిగా చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం ప్రకారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. కావున శుక్రవారం రోజు గుర్రంకొండ మండలంలోని క్లస్టర్ 1 (గుర్రంకొండ) పరిధిలో కల ముఖ్య నాయకులు అందరూ సమావేశం మై స్థానిక మధు కళ్యాణమండపం నందు ఈ నెల 27,28 వ తేదీలలో మహానాడు కార్యక్రమం జరుగుతుందని ఈ మహానాడు కార్యక్రమం ను విజయవంతం చేయమని కోరడం జరిగింది. అలాగే ప్రియతమ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి 27 వ తేదీన జరిగే మహానాడు నందు మండలంలోని గుర్రంకొండ మరియు తరిగొండ ప్రాంతాలలో పాల్గొంటారని ఈ సమావేశం నిర్వహించిన గుర్రంకొండ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాయని జగదీష్ కుమార్ తెలిపారు. ఈ సమావేశం లో గుర్రంకొండ క్లస్టర్ 1లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం

**జగన్ రాజకీయ ముసుగులో**
**ఫ్యాక్షనిస్టు: మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్**
**అపరిచితుడు క్యారెక్టర్‌లా జగన్ వ్యవహారం**
**హత్యా రాజకీయాల అసలు వారసుడు జగన్**
**చంద్రబాబు అభివృద్ధి చూసి జగన్ ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు**
**వ్యక్తిగత దూషణలే జగన్ రాజకీయ ఆయుధం**
**తెలుగుజాతికి పట్టిన రాజకీయ అరిష్టం**
**జగన్: మంత్రి అచ్చెన్నాయుడు**




**అమరావతి మన జనప్రగతి మే 22:–** హత్యా రాజకీయాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ముసుగులో ఉన్న ఫ్యాక్షనిస్టు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. సమాజంలో విద్వేషాలు, హింస, కక్ష రాజకీయాలను పెంచే గొడ్డలి పార్టీ రాష్ట్రానికి హానికరమని మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రెస్‌మీట్‌లో ఫ్రస్ట్రేషన్ స్పష్టంగా కనిపించిందన్నారు. రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే తట్టుకోలేక వ్యక్తిగత ఆరోపణలకు దిగుతున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. రెండేళ్ల పాలనలో విమర్శించడానికి ఒక్క అంశం కూడా దొరక్క చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి స్వభావం ఉన్న వ్యక్తులు వస్తారని ముందే గుర్తించి దర్శకుడు శంకర్ అపరిచితుడు సినిమా తీశారేమో అనిపిస్తోంది అంటూ ఎద్దేవా చేశారు.జగన్ చేసిన వ్యాఖ్యలతో రాజారెడ్డి దమనకాండ, నాటి చరిత్ర, వైఎస్ కుటుంబ రాజకీయ నేపథ్యం మొత్తం మళ్లీ చర్చకు వచ్చాయని అన్నారు. నేటి తరానికి వైఎస్ కుటుంబ చరిత్ర తెలిసేలా జగన్ స్వయంగా చేసుకున్నారని వ్యాఖ్యానించారు. రాజారెడ్డి హత్య కేసులో ఉన్న నిందితులందరినీ చంపేశారని, ఒక్క పార్థసారధి రెడ్డి మాత్రమే మిగిలారని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ఆ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి ఈరోజు వైసీపీలో ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్నాడని పరోక్షంగా ప్రస్తావించారు. అలాగే వంగవీటి రంగ హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు కూడా జగన్ పార్టీలోనే ఉన్నారని గుర్తు చేశారు. రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడి కొడుకు నీకు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలుకుతాడుడ సెండాఫ్ ఇస్తాడు అంటూ జగన్‌ను ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డికి హిందూ దేవుళ్లపై ఎందుకు కక్షో అర్థం కావడం లేదన్నారు. తిరుమల ఏడుకొండల అంశాన్ని ప్రస్తావిస్తూ, నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రజలు మరచిపోలేదన్నారు. ఆ వ్యాఖ్యలను తప్పుపట్టిన చంద్రబాబు వ్యాఖ్యలను ఇప్పుడు జగన్ వక్రీకరించి ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని చంపింది జగన్ అని బొత్సనే చెప్పారని నేను చెబితే ఆయన ఎందుకు ఏడ్చారో ఇప్పటికీ అర్థం కాలేదు అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. రిలయన్స్ సంస్థలపై దాడులు చేయించి, మళ్లీ వాళ్లకు రాజ్యసభ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఎవరి ప్రమేయం ఉందో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. నీ సొంత చెల్లెలు వైఎస్ సునీత జగన్ ప్రమేయం ఉందని చెబుతోందిడ దానికి సమాధానం చెప్పగలవా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవి కోసం బాబాయినే కాదు, సొంత పార్టీ కార్యకర్తలను కూడా వదల్లేదని తీవ్ర విమర్శలు చేశారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తండ్రి మరణం, బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామా గురించి మాట్లాడిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా వాటిపై మాట్లాడలేదని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. చంద్రబాబుకు నోటీసు కూడా ఇవ్వకుండా 53 రోజులు జైలులో పెట్టారని, తాను తప్పు చేయకపోయినా వేధింపులకు గురిచేశారని అన్నారు. అప్పటి ఎంపీ రఘురామ కృష్ణం రాజును చిత్రహింసలకు గురిచేశారని, కోర్టుల వల్లే ఆయన ప్రాణాలు దక్కాయని చెప్పారు. సోషల్ మీడియాలో తల్లి, చెల్లిని కూడా వదలకుండా అసభ్య పోస్టులు పెట్టించారని ఆరోపించారు.డాక్టర్ సుధాకర్ ఘటన, రేపల్లె నియోజకవర్గంలో అమర్‌నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన, నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబ ఆత్మహత్య వంటి ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో జరిగిన దమనకాండకు ఇవే నిదర్శనమన్నారు. టీడీపీ కార్యకర్తల ప్రాణాలు తీసి ఇప్పుడు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.రాజారెడ్డి నుంచి వివేకా వరకు ప్రతి చావులో జగనే ప్రధాన లబ్ధిదారు. జగన్‌ను సైకో అనాలా.. పిచ్చోడు అనాలా అర్థం కావడం లేదు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిపై జగన్ చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, అమరావతికి రాజముద్ర పడిన తర్వాత కూడా మావిగన్ అంటున్నారు. గ్రామీణ రోడ్లు, జాతీయ రహదారులు, ఐకానిక్ రాజధాని రోడ్లు అన్నీ ఒకేలా ఉంటాయా? అని ప్రశ్నించారు. విశాఖలో జగన్ కట్టుకున్న ప్యాలెస్‌కు ఎంత ఖర్చు పెట్టారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే జగన్ ఓర్చుకోలేకపోతున్నారు. ఆస్తి, పదవి కోసం కార్యకర్తలను కూడా వదలరు. ఆ పార్టీ కార్యకర్తనే కారు కింద వేసి తొక్కించేశారు అంటూ అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. జీతాలు ఇస్తే చాలు అని ఉద్యోగులతో దండాలు పెట్టించుకున్నారు. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినా జగన్ తగ్గించలేదు. ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న ప్రతి అంశాన్ని సరిచేసే ప్రయత్నం చేస్తున్నామని, విద్యుత్ ఛార్జీలను తగ్గించిన చరిత్రను ఎన్డీయే ప్రభుత్వం సృష్టించిందన్నారు. ఇకపై జగన్ చేసే ప్రతి అబద్ధపు ఆరోపణకు వడ్డీతో సహా సమాధానం చెబుతామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## పవన్ కళ్యాణ్ నాటు బాంబు లాంటివాడు ముట్టుకుంటే చాలా ప్రమాదం అంటున్న జనసేన పార్టీ నాయకులు




**వేంపల్లె మన జనప్రగతి మే 22:–** పవన్ కళ్యాణ్ ని చాలా మంది రాంగ్ హ్యాండిల్ చేస్తున్నారు. ఆయన సహజంగానే ఆవేశపరుడు, దూకుడు స్వభావం గల వ్యక్తి అని జనసేన పార్టీ నాయకులు గోసల ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ కు పరిమితి చెందిన ప్రసంగం,భవిష్యత్ మీద ఆశను ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని మాట్లాడారు. 15 ఏళ్లు ఎందుకు ఈ కూటమి పార్టీ ఉంటుంది అని అంటున్నారు అంటే, ప్రతి పక్ష పార్టీ వాళ్ళ మాటను ప్రజలు నమ్మరు కనుక, ఎందుకంటే వీరు వ్యక్తిగత జీవితాల గురించి వారి అభిప్రాయాల గురించి మాట్లాడుతూ ఉంటారు అని అన్నారు. ఎందుకంటే ఒక్కసారి పవన్ కళ్యాణ్ ను ఈ ప్రతి పక్షం కాని ప్రతిపక్ష పార్టీ రాంగ్ హ్యాండిల్ చేసింది, దీనివల్ల ఆ పార్టీకి ఎంత తీవ్రమైన నష్టం జరిగిందో ప్రజలందరికీ తెలుసు అని మాట్లాడారు. అయినా కూడా ఈ ప్రతిపక్ష పార్టీ వైఖరి ఇంకా మారలేదు అని అన్నారు. మీ పార్టీ గాని మీ పార్టీ సభ్యులు ఇలాగే ఉంటే ఇక్కడ మా సేనాని మందు పాతర లాంటివాడు కాలు పెట్టినా పేలిపోతారు, కాలు తీసినా పేలిపోతారు అని అన్నారు. కాబట్టి మీ ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రజలను మెప్పించే విధంగా మీ కార్యాచరణ, కార్యకలాపాలు మీరు ప్రజలకు ఏమి చేస్తారో చెప్పండి అని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పెదబల్లి సుధీర్ రెడ్డి, పసుపులేటి శ్యామ్, దేవా, మనోజ్ రెడ్డి, ఇతీష్ , సోక్కం మల్లికార్జున, నందా, ముక్తర్, ఇడుపులపాయ జయచంద్ర, లక్ష్మణ్ నాగేంద్ర,థామస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## బీసీవై పార్టీలో షేక్ నజీర్ బాషా చేరిక



**ఒంగోలు మన జనప్రగతి మే 22:–**కనిగిరి నియోజకవర్గానికి చెందిన రాజకీయ నాయకుడు షేక్ నజీర్ బాషా తన అనుచరులతో కలిసి బీసీవై పార్టీలో ఘనంగా చేరారు.బీసీవై రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు పార్టీ నాయకులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా షేక్ నజీర్ బాషా మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తానన్నారు. ప్రతి గ్రామాన్ని ప్రత్యేకంగా సందర్శించి ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని, పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా నిబద్ధతతో నిర్వర్తిస్తానన్నారు.రాబోయే రోజుల్లో బీసీవై పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం బోడె రామచంద్ర యాదవ్‌ను నజీర్ బాషా తన అనుచరులతో కలిసి ఘనంగా సత్కరించారు.

## కడప జిల్లాలో నివారించగల దృష్టి లోపాల నిర్మూలనకు యూసీఐఎల్ భారీ సాయం

**రూ.24.20 లక్షల సీఎస్ఆర్ అనుదానం పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్‌కు అందజేత**
**ప్రతి సంవత్సరం 5 వేలకుపైగా ఉచిత కంటి చూపు పునరుద్ధరణ శస్త్రచికిత్సలు**
**మూడు సంవత్సరాల పాటు ఉచిత కంటి వైద్య పరీక్షలు, అవసరమైన శస్త్రచికిత్సలు**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి,మే 22:–** గత ఎడాది అక్టోబర్ 31, కడప జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లో నివారించగల దృష్టి లోపాలను తగ్గించే లక్ష్యంతో యూరేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్‌కు రూ.24.20 లక్షల విలువైన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (అనుదానాన్ని అందజేసింది. ఈ నిధులను ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నారు.ఈ సందర్భంగా యూసీఐఎల్ జనరల్ మేనేజర్ (మిల్) సుమన్ సర్కార్ పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్ యూనిట్ అధికారి సూర్యప్రకాశ్‌కు అధికారికంగా చెక్కును అందజేశారు.ఇటీవల భూమయ్యగారిపల్లె లో ఉసిరి సంస్థ మరియు పుష్పగిరి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యూసీఐఎల్ జనరల్ మేనేజర్ (సివిల్) ఆర్.కే. మిశ్రా, తుమ్మలపల్లె ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్ & సీఎస్ఆర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ బి. నవీన్ కుమార్ రెడ్డి, డీజీఎం (జియాలజీ) విజయ్ కుమార్, అదనపు మేనేజర్ (అకౌంట్స్) ఎస్.ఎస్. గుప్తా తదితరులు పాల్గొన్నారు.ఈ ఆర్థిక సహాయంతో పుష్పగిరి ఇన్‌స్టిట్యూట్ ప్రతి సంవత్సరం 5 వేలకుపైగా ఉచిత కంటి చూపు పునరుద్ధరణ శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కడప జిల్లా మరియు యూసీఐఎల్ పరిసర ప్రాంతాల పేద ప్రజలకు, యూసీఐఎల్ ఉద్యోగులకు అందించే స్థాయిలోనే, పూర్తిగా ఉచితంగా ఈ సేవలు అందించనున్నట్లు తెలిపారు.అత్యంత వెనుకబడిన వర్గాల ప్రజలకు నాణ్యమైన కంటి సంరక్షణ సేవలు చేరువ చేయడంలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించనుంది. ముఖ్యంగా యురేనియం ప్రాజెక్టు పరిసర గ్రామాల్లో వచ్చే మూడు సంవత్సరాల పాటు ఉచిత కంటి వైద్య పరీక్షలు, అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్ యూనిట్ హెడ్ శ్రీ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, “సామాజిక బాధ్యతతో యూసీఐఎల్ అందిస్తున్న ఈ సహాయం ఎంతో గొప్పది. ఈ నిధులతో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చుకుని వేలాది మంది రోగులకు తిరిగి చూపును అందించే అవకాశం లభిస్తుంది” అని పేర్కొన్నారు.

## రూపా నాయక్ తండాను రెవెన్యూ విలేజ్‌గా ప్రకటించాలి

- అధికారుల గైర్హాజరుపై గిరిజనుల ఆగ్రహం




**వజ్రకరూరు మన జనప్రగతి మే 22:–**రూపా నాయక్ తండ గ్రామపంచాయతీని రెవెన్యూ విలేజ్‌గా ప్రకటించాలని బంజారా సంఘం జాతీయ నేత ఎస్.కె. కేశవ నాయక్ అధికారులను కోరారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సామా సంగ్ మహారాజ్ దేవాలయం వద్ద రూ.50 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు గ్రామ ముఖద్వారం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.వజ్రకరూరు మండలం రూపా నాయక్ తండ గ్రామపంచాయతీలోని ఆర్డీటీ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన “ధర్తీ అబ్బా జన జాగృతి గ్రామీణ ఉత్కర్ష అభియాన్” సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో అమలు చేస్తున్న ఈ పథకంలో 23 శాఖల సమన్వయంతో తండాకు అన్ని రకాల మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.గ్రామంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన సీసీ రోడ్డు, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక నిధులు విడుదల చేసి సంప్రదాయ వేషధారణ కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు పెంచి ఫినిషింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో హౌసింగ్ పీడీ మాట్లాడుతూ గతంలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ బిల్లులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే చెల్లింపులు చేస్తామని తెలిపారు.అయితే సమీక్ష సమావేశానికి పలువురు శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తులసీదాస్ నాయక్, ప్రత్యేక అధికారి రామ్మూర్తి నాయక్, మాజీ ఎంపీపీ వెంకటమ్మ బాయి, నంగ్రేర్ నాయక్, ఎస్.కె. సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నారా లోకేష్ సారథ్యంలో ప్రధానంగా విద్యా, యువత భవిష్యత్తు: మంత్రి ఎస్. సవిత




**జమ్మలమడుగు మన జనప్రగతి మే 22:**–రాష్ట్ర ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ప్రధానంగా విద్యా, యువత భవిష్యత్తు కోసం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి & జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత అన్నారు "పాదయాత్ర సమయంలో పేద విద్యార్థులు, యువత ఎంతో ఆశతో తమ సమస్యలను వివరించారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని యువత ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలోనే యువతకు తమ రాష్ట్రంలోనే మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో నారా లోకేష్ గారు 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని ముందుకు తీసుకువచ్చారు. నేడు రాయలసీమ జిల్లాలలో భారీ స్థాయిలో పరిశ్రమలు, కంపెనీలు రావడం ఆ సంకల్పానికి నిదర్శనం" అని తెలిపారు.మన పిల్లలు ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా, ఇక్కడే మంచి ఉద్యోగాలు పొందేలా పరిశ్రమలకు అవసరమైన వసతులు, అనుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా ఎదుగుతోంది" అని పేర్కొన్నారు.

# మీకోసం నేనున్నా-పేదలకు మంత్రి నారాయణ బరోసా

**● మరోసారి మానవత్వం చాటుకొన్న మంత్రి నారాయణ ● ఢిల్లీలో ఉన్నా పేద కుటుంబానికి అండగా నిలిచి దాతృత్వం చాటుకున్న మంత్రి ● పుట్టెడు దుఃఖంలో ఉన్న గిరిజన కుటుంబానికి కొండంత ధైర్యం ఇచ్చిన మంత్రి ● జాకీర్ హుస్సేన్ నగర్ యువకుడి మృతికి సంతాపం**

**నెల్లూరు మన జనప్రగతి మే 22:**- రాష్ట్రపురపాలక పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు.కొడుకుని కోల్పోయి పుట్టెడు దుఃఖం లో ఉన్న పేదకుటుంబానికి చేయూతనందించి పెద్దలొడుకులా నిలిచాడు.మీకోసం నేనున్నా అంటూ కొండంత అండగా నిలిచి పేద తల్లితండ్రుల బతుకుకు



భరోసా కల్పించారు.వివరాల్లోకి వెళితే నెల్లూరు నగరంలొని 3వ డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్ గిరిజన కాలనీకి చెందిన యాదగిరి నాగేంద్ర (24) అనే యువకుడు రెండురోజుల క్రితం అకాల మరణం చెందాడు.చేతికందివచ్చిన కొడుకును మృత్యువు కబళించటంతో ఆ నిరుపేద కుటుంబం పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. కొడుకుని కోల్పోయి, జీవనోపాధి కరువై తల్లడిల్లుతున్న తల్లిదండ్రుల విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర అధికారిక పనుల నిమిత్తం ఢిల్లీలో ఉన్న మంత్రి నారాయణ సమాచారం అందిన వెంటనే స్పందించి తన పెద్ద మనసును చాటుకున్నారు.ఇంటిపట్టునే ఉండి జీవనోపాధి పొందేందుకు ఇస్త్రీ బండి కావాలని ఆ కుటుంబం కోరిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే వారికి ఇస్త్రీ బండిని కొనుగోలు చేసి అందజేయాలని నెల్లూరులోని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. మంత్రి నారాయణ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన నాయకులు మామిడాల మధు, ఆదినారాయణ రెడ్డి, కొమరి విజయమ్మ, కాకర్ల గోవర్ధన్, కమలాకర్, శైలజ, కృష్ణ, మల్లికార్జున, మస్తాన్ తదితరులు బాధిత కుటుంబానికి ఇస్త్రీ బండిని పంపిణీ చేసి ధైర్యం చెప్పారు.ఎక్కడ ఉన్నా నెల్లూరు ప్రజల కష్టాలపైనే మంత్రి నారాయణ దృష్టి ఉంటుందని, పేదల కష్టాలు తీర్చేందుకు ఆయన ఎప్పుడూ ముందుంటారని స్థానిక నాయకులు కొనియాడారు. త్వరలోనే ఆయన స్వయంగా వచ్చి ఆ కుటుంబాన్ని పరామర్శిస్తారని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.

# వై వి యులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**● ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు**

**వైవియు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు భరత్ సింహా వినతి**



**కడప మన జనప్రగతి మే 22:**–కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కడపలో జరిగిన కార్యక్రమంలో వై వి యు టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడు భరత్ నరసింహ వినతి పత్రం ద్వారా కోరారు.రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీలో 1523 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం హర్షనియమని కొనియాడారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆడిటోరియం,పరీక్షల విభాగం,అదనపు తరగతి గదుల భవనాలకు నిధులు కేటాయించాలని సూచించారు.వై వియు లో ఆగిపోయిన ఎంసీఏ. ఎంబీఏ. ఇతర భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి మార్గం చూపాలని తెలియజే చేశారు. పలు సమస్యలపై మంత్రి లోకేష్ కు వినతి పత్రం ద్వారా తెలియజేశారు

# సొసైటీ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేసిన రైతులు

**● లిఖిత పూర్వకంగా ఆర్జీ ఇస్తే ఉన్నతాధికారుకు నివేదిక ● సొసైటీ విచారణ అధికారి కమలమ్మ**

**వేంపల్లె మన జనప్రగతి మే 22:**-స్థానిక చింతలమడుగుపల్లె వ్యవసాయ సహకార సొసైటీలో దాదాపు రూ 2 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ప్రాథమిక విచారణలో తెలింది. దీంతో కడప కో అపరేటవ్ బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులివెందుల కో అపరేటవ్ బ్యాంకు సబ్ డివిజనల్ అధికారినైనా కమలమ్మను విచారణకు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం చింతలమడుగుపల్లె సొసైటీలో విచారణ చేపట్టేందుకు విచ్చేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కత్తులూరు, అలిరెడ్డిపల్లె, వేంపల్లె, చింతలమడుగుపల్లెతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న రైతులు మాకుమ్మడిగా చింతలమడుగుపల్లె వ్యవసాయ సహకార సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకొని విచారణ అధికారి కమలమ్మను తమకు అ న్యాయం జరిగిందని చుట్టు ముట్టారు. అలాగే కార్యాలయంకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. గతంలో చింతలమడుగుపల్లె సహకార సొసైటీలో సిఇఓగా పని చేసిన రామిరెడ్డి అవినీతికి పాల్పడినట్లు బైయారెడ్డి, ప్రసాద్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పుల్లయ్య, సుదర్శన్ రెడ్డి, సుబ్బారెడ్డి, రామానందరెడ్డితో పాటు పలువురు రైతులు అరోపించారు. చింతలమడుగుపల్లె సొసైటీలో వివిధ రకాల రుణాలను 1400 మంది రైతులు తీసుకోన్నట్లు తెలిపారు. పంట రుణాల్లో రైతుల వద్ద నుంచి సిఇఓ రామిరెడ్డి 9 శాతం వడ్డిని వసూలు చేయాల్సి ఉండగా 12 శాతం వరకు వడ్డీలు వసూలు చేసినట్లు రైతులు అరోపించారు. 12 సంవత్సరాల నుండి సిఇఓ రామిరెడ్డి రైతుల నుండీ అధిక వడ్డీని వసూలు చేసి తన



జేబులో వేసుకొంటున్నట్లు తెలిపారు. ఎస్టీ అదర్స్ రుణాల్లో కూడ అవినీతికి పాల్పడినట్లు చెప్పారు. ఒక్కోక రైతుకు సంబంధించిన రుణాల్లో రూ 15 నుండి రూ 20 వేల వరకు స్వాహా చేసినట్లు అరోపించారు. కోట్లల్లో అవినీతి చేసిన సిఇఓ రామిరెడ్డిపై ఎటువంటి చర్యలను ఉన్నతాధికారులు తీసుకోలేదని మండిపడ్డారు. విచారణ పేరుతో కాలయాపన చేయడం తప్పా సిఇఓపై చర్యలు తీసుకోక పోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణకే పరిమితం అయ్యారని రైతులు దుయ్యబట్టారు. ఇప్పటికి 5 సార్లు విచారణ చేశారని అయిన సిఇఓ చేసిన అవినీతి బయట పడలేదా అని రైతులు ప్రశ్నించారు. రుణాల వడ్డీల రెన్యువల్ చేయకుండా కోట్లు రూపాయలను వ్యవసాయ సహకార సంఘం సీఈవో రామిరెడ్డి మింగి వేయడం జరిగిందని రైతులు చెప్పారు. రైతులకు అ న్యాయం చేసిన సిఇఓ రామిరెడ్డిని ఉద్యోగం నుండి తొలగించి రైతుల నుండి దోచేసిన డబ్బులను రైతులకు ఇప్పించడంతో పాటు ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విచారణలో సిఇఓ చేసిన అవినీతి బయట పడిన అధికారులు వాటిని గొప్యంగా దాచి పెట్టడం శోచనీయమని రైతులు అరోపించారు. డబ్బులు కట్టిన రసీదులను చూపించిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో రైతులు చెల్లించిన రసీదులను తనీఖీ చేసి సిఇఓ చేసిన అవినీతి బయట పడుతుందని చెప్పారు. రైతులు బ్రతకలేక రుణాలు తీసుకొంటే రైతులకు ఇచ్చిన రుణాల్లో సిఇఓ రామిరెడ్డి అవినీతికి పాల్పడినట్లు చెప్పారు. రైతులు ఇచ్చిన కొంత డబ్బు బ్యాంకులో జమ చేసి కొంత డబ్బులు స్వాహ చేసినట్లు రైతులు తెలిపారు. అనంతరం అవినీతికి పాల్పిడిన సిఇఓ రామిరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకొని ఉద్యోగం నుండి తొలగించాలని విచారణ అధికారినైనా పులివెందుల కో అపరేటవ్ బ్యాంకు సబ్ డివిజనల్ అధికారి కమలమ్మకు రైతులు రాత పూర్వకంగా వినతి పత్రం అందజేశారు. దీంతో రైతులు ఇచ్చిన రాత పూర్వక వినతి పత్రాన్ని జిల్లా ఉన్నతాధికారుకు నివేదిక రూపంలో అందజేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు వెనుతిరిగి వెళ్లి పోయారు. సిఇఓ రామిరెడ్డిపై వచ్చిన అరోపణలపై విచారణ అధికారి కమలమ్మను వివరణ కోరగా ప్రజా సమస్యల వేదికలో కత్తులూరుకు చెందిన బైయా రెడ్డి, ప్రతాప్ రెడ్డిలు చింతలమడుగుపల్లె సహకార సొసైటీ సిఇఓ రామిరెడ్డిపై పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కడప కోఅపరేటవ్ బ్యాంకు ఉన్నతాధికారులు తనకు విచారణ అధికారిగా వేయడంతో విచారణ చేసేందుకు వేంపల్లె సొసైటీ కార్యాలయంకు వచ్చినట్లు తెలిపారు. రాత పూర్వకంగా రైతులు అందరూ కలిసి వినతి పత్రం అందజేశారని చెప్పారు. విచారణలో సిఇఓ రామిరెడ్డి అవినీతికి పాల్పడినట్లు కనపడుతున్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరుగుతుందని విచారణ అధికారి కమలమ్మ తెలిపారు.

# 837 ఎకరాల్లో నేలకొరిగిన అరటి



**లింగాల మన జనప్రగతి మే 22:**–మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి వీచిన పెనుగాలులకు పెద్ద ఎత్తున అరటి పంట నేలమట్టమైనది. పంట ప్రాథమికనష్ట నివేదికను తయారు చేసేందుకు శుక్రవారం ఉదయం లింగాల మండలంలో ప్రాంతీయ ఉద్యానవన శాఖ అధికారి రాఘవేందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబకపల్లి గ్రామానికి చెందిన 60 మంది రైతులకు చెందిన 35 హెక్టార్లు, హిరోజ్పురం గ్రామానికి చెందిన 20 మంది రైతులకు చెందిన 12 హెక్టార్లు, వడ్లమానిపల్లి కి చెందిన 8 మంది రైతులకు చెందిన 4 హెక్టార్లు, మురారిచింతలకు చెందిన 150 మంది రైతులకు చెందిన 130 హెక్టార్లు, గుణకనపల్లికి 50 మంది రైతులకు చెందిన 30 హెక్టార్లు, వెలిదండ్ల 5మంది రైతులకు చెందిన 9 హెక్టార్లు, కోమనూతల గ్రామంలో 100 మంది రైతులకు చెందిన110 హెక్టార్లలో, లోపట్నూతల గ్రామంలో నలుగురు రైతులకు చెందిన 5 హెక్టార్లు మొత్తం మండల పరిధిలో 397 మంది రైతులకు చెందిన 335 హెక్టార్లలో(837 ఎకరాలు) అరటిపంట నష్టం జరిగిందని హెచ్ఓ తెలిపారు. ప్రాథమికంగా తయారుచేసిన పంట నష్ట నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందన్నారు ఇంకను ఎవరికైనా పంటనష్టం జరిగి ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువస్తే నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# దాతల ఆశయాలను కొనసాగించాలి: మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్



**కాకినాడ మన జనప్రగతి మే 22:**–నాడు వారి కున్న ఆస్తులను దానం చేసి ఎంతో ముందు చూపుతో సేవలను చేసిన దాతలను నిరంతరం స్మరించుకొని వారి ఆశయాలను కొనసాగించాలని కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ సినిమా రోడ్డులో ఉన్న మంత్రిప్రగడ వారి ధర్మసత్రం వ్యవస్థాపకులు మంత్రిప్రగడ నరసింహారావు పంతులు 144వ వర్ధంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం, అనంతరం అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ముందు చూపుతో ప్రజా అవసరాల నిమిత్తం కోట్లాది రూపాయల విలువ గల ఆస్తులను కాకినాడ నగరంలో ఎంతోమంది దానం చేశారని వారిలో మంత్రిప్రగడ ఒకరని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కార్యవర్గ సభ్యులు కొనసాగించి మన్నలను పొందాలని శేఖర్ సూచించారు.మంత్రిపగడ విగ్రహానికి పూలమాలలు వేసి వస్త్ర దానం,అన్నదాన కార్యక్రమాన్ని శేఖర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సత్రం చైర్మన్ మేడిశెట్టి ఈశ్వర రావు (చిన్నా),నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు,కార్యనిర్వాహణాధికారి సిహెచ్ఎస్ఎన్ఎస్ శ్రీనివాస్,ధర్మకర్తలు జి.సుజాత,జె.సత్యవేణి, పి సత్యనారాయణ,ఎం.నాగరామ లోకేశ్వరి,కే వరప్రసాద్, ఏ శ్రీను, ఎం దుర్గాప్రసాద్, కెవి రాఘవులు, బి సరస్వతి, సిబ్బంది అనిల్, ఇందు శివరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# వెంకప్పకోటలో "ఒక నెలఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు" కార్యక్రమం ప్రారంభం

**వెంకప్పకోటను సమస్యల రహిత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం.**

**నాలుగు విడతల్లో గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**మదనపల్లి మన జనప్రగతి మే 22 :** – వెంకప్పకోటను సమస్యల రహిత ఆదర్శ గ్రామంగా దిద్దేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మదనపల్లి మండలం,వెంకప్ప కోట గ్రామంలో "ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు " కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు..జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి లతో కలసి పాల్గొని అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా "ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనలు " కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల ఒక నియోజకవర్గంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, నాలుగు విడతల్లో అధికారులు గ్రామాన్ని సందర్శిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ నెల 7, 8 తేదీలలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ శాఖ మరియు ఇతర శాఖలు ఎలా పరిష్కరిస్తున్నాయనే అంశంపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఆ సదస్సులో వచ్చిన సూచనల మేరకు గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి ఈ ప్రత్యేక కార్యాచరణ రూపొందించ బడిందన్నారు.ఈ కార్యక్రమంలో





మొదటి సందర్శన లో గ్రామంలోని సమస్యలను గుర్తించి నమోదు చేయడం, రెండో మరియు మూడో సందర్శనలో వాటిని పరిష్కరించడం, నాలుగో విజిట్‌లో సంబంధిత ఉత్తర్వులు, పత్రాలు, ప్రొసీడింగ్స్ కాపీలను ప్రజలకు అందజేయడం జరుగుతుందని వివరించారు. గ్రామాల వారీగా ఈ విధానాన్ని అమలు చేస్తే భూవివాదాలు, రెవెన్యూ సమస్యలు, ఇతర పెండింగ్ అంశాలను సమగ్రంగా పరిష్కరించగలమని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో తొలి కార్యక్రమాన్ని మదనపల్లి మండలం వెంకటప్పకోట గ్రామంలో ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామ ప్రజలు కలెక్టరేట్ లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అధికారుల బృందమే గ్రామానికి వచ్చి సమస్యలను నమోదు చేసుకుంటుందని పేర్కొన్నారు.ఈ సదస్సులో భూసంబంధిత సమస్యలు, పట్టాదార్ పాస్ బుక్,సబ్ డివిజన్ లోపాలు, పేర్లలో పొరపాట్లు, వారసత్వ మ్యుటేషన్లు, 22ఏ సమస్యలు, డాటెడ్ ల్యాండ్స్ సమస్యలు, గ్రామానికి సంబంధించిన సమస్యలు, తదితర అంశాలను నమోదు చేసి, వచ్చే మూడు వారాల్లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.కావున గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ,మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరమే ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్, విద్య, వైద్య, అగ్రికల్చర్,హార్టికల్చర్,గృహ నిర్మాణం, డ్వామా, తదితర మండల స్థాయి అధికారులు గ్రామంలో చేపడుతున్న పనులను పర్యవేక్షించి,పరిశీలించి సమస్యలను పుట్టించి వాటి పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ – 25,పౌర సరఫరాలు – 1, రోడ్లు, భవనాల శాఖ – 1, ఏపీ ఎస్పీడీసీఎల్ – 1,ఇతర గ్రామ సమస్యలు – 3 వివిధ రకాల సమస్యలపై మొత్తంగా 31 అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు.ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి ఇంచార్జ్ తాసిల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో తాజ్ మసూద్, పంచాయతీరాజ్,వ్యవసాయ, విద్య, వైద్య, నీటిపారుదల, తదితర శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
23 - 05 - 2026

# దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపం "ఎస్ఎఈఎల్" సోలార్ ప్రాజెక్టు

- మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి
- బ్రాండ్ సీబీఎన్ వల్లే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు
- మాటిచ్చి చేతల్లో చూపే నాయకత్వంవల్లే పెట్టుబడుల వెల్లువ
- క్లీన్ ఎనర్జీ వినియోగించడమే కాదు... దేశానికి ఎగుమతి చేస్తాం
- సేల్ సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో మంత్రి నారా లోకేష్









**జమ్మలమడుగు మన జనప్రగతి మే 22:-** కేవలం ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం మాత్రమే కాదు, దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణ కలగలిసిన వేడుక అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3వేలకోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ (ఎస్ఎఈఎల్) వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... "మా నాన్న ఉత్తరం రాశారు.. మా తాత కల కన్నారు.. నేను ఆత్మలతో మాట్లాడాను అంటే నమ్మే వాళ్ళు ఎవరు లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి." రెండింటికీ ఎంతో తేడా ఉందని అన్నారు. **రాష్ట్రం చూపు.. జమ్మలమడుగు వైపు** మంత్రి లోకేష్ మాట్లాడుతూ...రికార్డ్ టైమ్ లో ఎస్ఎఈఎల్ ప్రాజెక్ట్ పూర్తి అయింది. ఇది స్థానిక రైతుల విజయం, జమ్మలమడుగు యువత విజయం. మీ సహకారం వల్లనే ఈ ప్రాజెక్ట్ 11 నెలల్లో పూర్తి అయింది. రాష్ట్రం మొతం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఈరోజు ఇతర నియోజకవర్గాల వాళ్ళు మాకు కూడా ఇటువంటి కంపెనీలు వస్తే బాగుంటుంది అనుకుంటున్నారు. ఇక్కడ మెగా సోలార్ పార్క్ ఏర్పాటు చేసింది మనమే. ఇప్పుడు ఎస్ఎఈఎల్ తీసుకువచ్చింది మనమే. అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో ఎన్టిపిసి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌లు తీసుకొచ్చింది మనమే. ఎస్ఎఈఎల్ రావడం వల్ల రైతులకు లబ్ధి జరిగింది, యువతకు ఉద్యోగాలు వచ్చాయి. కంపెనీలు తీసుకురావాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది ఒక్క మన బ్రాండ్ సీబీఎన్ గారికి మాత్రమే సాధ్యమని అన్నారు. **విజయానికి మూడు మెట్లు** పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనలో ఏపీ విజయానికి ముఖ్యమైన మూడు కారణాలున్నాయి. అవి ఏంటంటే.. మొదటిది బ్రాండ్ సీబీఎన్. "పెట్టుబడిదారులు ఇప్పుడు మేము ఎంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రాగలం?" అని అడుగుతున్నారు. ఎందుకంటే, ఇచ్చిన మాటను చేతల్లో చూపే నాయకత్వంతో నిర్మితమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. మేము స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను నమ్ముతాం. నిర్ణయాలు వేగంగా తీసుకుని, ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసినప్పుడే విధానాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాజెక్టే అందుకు నిదర్శనం. ప్రాజెక్ట్ భూమిపూజ నుండి ప్రారంభోత్సవం వరకు రికార్డు స్థాయిలో 11 నెలల్లో పూర్తయింది. మూడవది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతమైంది. మాది డబుల్-ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. రాష్ట్రప్రభుత్వ దార్శనికతకు కేంద్ర ప్రభుత్వ మద్దతు తోడైనప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుంది. **ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్ నిర్మాణం** ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, అధునాతన తయారీ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తోంది. ఆధునిక ఆర్థిక వృద్ధి ఎకోసిస్టమ్స్, స్పెషలైజేషన్, ఆవిష్కరణల ద్వారానే సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వం కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల ఎకో సిస్టమ్స్ ను నిర్మిస్తున్నాయి. ఎస్ఎఈఎల్ నాయకత్వంతో మొట్టమొదటి సంభాషణ నాకు ఇప్పటికీ గుర్తుంది. ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సంఘం సమావేశం సందర్భంగా జరిగింది. అది పునరుత్పాదక ఇంధనానికి సంబంధించిన సమావేశం కూడా కాదు. కానీ ఆరోజు ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను నిర్మించాలనే తమ ప్రణాళికల గురించి ఎస్ఎఈఎల్ నాయకత్వం ఎంతో ఉద్వేగంగా మాట్లాడింది. వారి ఉద్దేశాన్ని నేను వెంటనే గ్రహించాను. రెన్యువబుల్ ఎనర్జీలో ఫలితాలను సాధించాలన్న ఎస్ఎఈఎల్ సంస్థ దీర్ఘకాలిక ఆలోచన, వారి తపనను నేను పసిగట్టగలిగాను. **స్థానిక సమాజంతో కలసి ముందడుగు** పంజాబ్ లీడర్ షిప్ నేతృత్వంలో పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్ లో కార్యకలాపాలు నిర్వహించగలదా? అనే ప్రశ్న నాలో మెదిలింది. ఎస్ఎఈఎల్ బృందం అమరావతికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిని, నన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధమై, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రావడం నా ప్రశ్నకు జవాబు దొరికింది. ఎస్ఎఈఎల్ బృందం చక్కగా స్థానిక సమాజం, ప్రజలతో మమేకమయ్యారు. క్షేత్రస్థాయిలో గ్రామస్థులు, రైతులు, స్థానిక యంత్రాంగం, ఇంజనీర్లు, కార్మికులు, అధికారులతో కలిసికట్టుగా పనిచేశారు. వారు క్షేత్రస్థాయికి వచ్చి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని, స్థానికుల సహకారంతో ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టును విజయవంతం చేసింది. **రికార్డువేగంతో ప్రాజెక్టు పూర్తి** ఎస్ఎఈఎల్ ₹3,000 కోట్ల పెట్టుబడి పెట్టి, 2,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వీసూ1, వీసూ2 భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం 11 నెలల్లో వేగవంతంగా పూర్తయి రికార్డు సృష్టించింది. పంజాబ్, రాజస్థాన్‌లోని ఎస్ఎఈఎల్ సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అధునాతన టాప్‌కాన్ బైఫేషియల్ సోలార్ మాడ్యూల్స్ ఏర్పాటుచేశారు. **11లక్షల టన్నుల కర్బన ఉద్గారాల తగ్గుదల** ఈ ఒక్క ప్రాజెక్ట్ ద్వారానే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన విద్యుత్, సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాతో కుదిరిన 25 ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం జాతీయ గ్రిడ్‌లోకి సరఫరా అవుతుంది. ఈ విద్యుత్ గుజరాత్‌తో సహా ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, భారతదేశానికి ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుతోంది. భారతదేశ హరిత ఇంధన విప్లవానికి నాయకత్వం వహించడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. ఎస్ఎఈఎల్ బృందం మొత్తానికి, ముఖ్యంగా పంజాబ్ నుండి వచ్చిన మన సోదర సోదరీమణులకు నేను చెప్పేది ఒక్కటే. "తుస్సీ కమాల్ కర్ దిట్టా...చక్ దే ఫట్టే!" ఆంధ్రప్రదేశ్ మిమ్మల్ని కుటుంబ సభ్యులుగా స్వాగతిస్తోంది. క్రమశిక్షణ, పట్టుదల, వేగంతో ఎలా సాధించగలమో మీరు ఆచరణాత్మకంగా నిరూపించారు. **నిర్మాణ సమయంలోనే వెయ్యిమందికి ఉపాధి** ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ-ఉపాధి లభించింది. వీరిలో 80 శాతం మంది స్థానికులే. వీరి ఆదాయాలు మెరుగయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా 760 మంది రైతులు, వారి కుటుంబాలు లబ్ధి పొందాయి. **వ్యవసాయ వ్యర్థాల నుంచి విద్యుత్** రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ వ్యర్థాల నుండి దాదాపు 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేవి ఎస్ఎఈఎల్ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇవి రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పిస్తాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో ఇవి వేలాది ఉద్యోగాలను సృష్టిస్తాయి. **మరిన్ని పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నాం** ఎస్ఎఈఎల్ బృందం వారి రాబోయే ఐపీవో ప్రయాణంలో, భారతదేశం అంతటా వారి భవిష్యత్ విస్తరణ ప్రణాళికలలో గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాం. నిరాటంకమైన కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ కోసం మన స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలన్నీ పూర్తి మద్దతును కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఎస్ఎఈఎల్ సంస్థకు ఏ మద్దతు కావాలన్నా నేను ఒక్క వాట్సాప్ కాల్ దూరంలోనే ఉంటానని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, సేల్ (ఎస్ఎఈఎల్) కో-ఫౌండర్ & డైరెక్టర్ సుఖ్ భీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సీఈవో లక్షిత్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది

- జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యం
- పెనికలపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి లోకేష్
- సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు ద్వారకానాథ రెడ్డి కుటుంబంతో మాటామంతీ
- సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న వివిధ పంటల పరిశీలన
- ప్రకృతి వ్యవసాయంతో అద్భుతాలు చేస్తున్న ద్వారకానాథ రెడ్డిని అభినందించిన మంత్రి







**జమ్మలమడుగు మన జనప్రగతి మే 22:-** రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లాలో రెండు రోజు పర్యటనలో భాగంగా ముందుగా జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరు మండలం పెనికలపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మంత్రి లోకేష్ సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగు చేస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో సంభాషించారు. ముందుగా సేంద్రీయ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు రైతు ద్వారకానాథ్ రెడ్డి, ఆయన సతీమణి రాఘవేంద్రవతిలు స్వాగతం పలికారు. **17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్న ద్వారకానాథ రెడ్డి కుటుంబం** పెనికలపాడుకు చెందిన రైతు ద్వారకానాథ రెడ్డి, ఆయన సోదరుడు రమణారెడ్డిలు గత ఐదేళ్లుగా తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన 17 ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. పంటలు, పశుపోషణ, కోళ్లు, చేపల పెంపకం వంటి వాటిని ఒకదానికొకటి అనుసంధానం చేసి సమీకృత సేంద్రీయ సాగు చేస్తూ స్థిరమైన ఆదాయం అర్జిస్తున్నారు. తమ పొలంలో మామిడి, బత్తాయి, ఉసిరి, కొబ్బరి, చిన్న నిమ్మ, నేరేడు, జామ, మునగ, రామాఫలం, సీతాఫలం పంటల సాగుతో పాటు 250 వరకు నాటుకోళ్ల పెంపకం, 60 వరకు పొట్టేళ్లు, చేపల సాగు చేస్తున్నారు. **సేంద్రియ సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్న మంత్రి లోకేష్** ఈ సందర్భంగా రైతు ద్వారకానాథ రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మంత్రి సంభాషించారు. ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడానికి గల కారణాలను మంత్రి లోకేష్ అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో 70 ఏళ్ల వయస్సున్న సేంద్రియ రైతు లక్ష్మీనారాయణను స్ఫూర్తిగా తీసుకుని తాము సేంద్రియ సాగు చేస్తున్నామని వివరించారు. మొదట ఒడిదొడుకులు ఎదుర్కొన్నా.. వ్యవసాయ అధికారుల ప్రోత్సాహంతో నిలదొక్కుకున్నామని చెప్పారు. వ్యవసాయ అధికారులు సేంద్రియ సాగులో మెళకువలపై తిరుపతిలో శిక్షణ అందించారని, బయో రీసెర్చ్ సెంటర్ కేటాయించారని తెలిపారు. తమ పొలంలోనే సహజ ఎరువులు, 32 రకాల జీవ వైవిధ్య గింజల తయారీ చేపట్టినట్లు వివరించారు. పురుగుమందులు, రసాయన ఎరువులు అవసరం ఇప్పుడు తమకు లేదన్నారు. పంట పెట్టుబడి తగ్గిపోవడంతో సమీకృత సేంద్రీయ సాగు ద్వారా నెలవారీ ఆదాయం పొందుతున్నామన్నారు. ఒక్క ఆవుతోనే 20 ఎకరాల వరకు సేంద్రియ సాగు చేపట్టవచ్చని తెలిపారు. 250 నాటుకోళ్ల పెంపకం ద్వారా పొలంలో కలుపు తీసే పనిలేదని, పురుగుమందుల అవసరం లేదని వివరించారు. తమ వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న మామిడి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఆదాయం పొందుతున్నామని చెప్పారు. ప్రభుత్వ పరంగా మరింత సహకారం అందిస్తే ప్రకృతి వ్యవసాయంలో అద్భుతాలు చేయవచ్చని ధీమావ్యక్తం చేశారు. **రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది** ఈ సందర్భంగా మంత్రి లోకేష్ స్పందిస్తూ .. పంట పొలాల్లో అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం ద్వారా భూసారం దెబ్బతినడంతో పాటు రైతుకు సాగు పెట్టుబడి వ్యయం అధికమవుతోందన్నారు. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని వివరించారు. రాష్ట్రంలోని రైతులను సేంద్రియ సాగువైపు మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం కూడా ఇందుకు కృషిచేస్తోందని వివరించారు. చిరుధాన్యాల సాగును కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాయలసీమలో బిందు సేద్యానికి మరింత అండగా ఉంటున్నామని, గొలుసుకట్టు చెరువుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు స్థానిక రైతులను అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు ప్రభుత్వం కూడా మద్దతుగా ఉంటుందన్నారు. వ్యవసాయ క్షేత్రం మొత్తం కలియతిరిగి వివిధ పంటల సాగును మంత్రి పరిశీలించారు. అనంతరం 32 లక్షల లీటర్ల సామర్థ్యమున్న నీటి కుంటను మంత్రి పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీకృత సేంద్రియ సాగులో అద్భుతాలు సృష్టిస్తూ.. స్థిరమైన ఆదాయం పొందుతున్న మునగాల ద్వారకానాథ్ రెడ్డి, కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన మామిడిని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రుచి చూశారు. అనంతరం రైతు ద్వారకానాథ రెడ్డి కుటుంబం మంత్రి లోకేష్ కు మామిడి పండ్లను బహుమతిగా అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి ఫోటోలు దిగారు. రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, ఆయన సతీమణి రాఘవేంద్రవతి, ద్వారకానాథ రెడ్డి సోదరుడు రమణారెడ్డి, ద్వారకానాథ రెడ్డి మాతృమూర్తి నారాయణమ్మ, రమణారెడ్డి కుమారుడు విఘ్నేశ్వర్ రెడ్డి, కుమార్తె జ్యోతికా రెడ్డి పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174